POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జనవరి 2023
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 40 సంచిక: 09



సాయిబాబా మాసపత్రిక పాఠకులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు!

## ఈ నెల పండుగలు

**జనవరి 10 - పరాడసింగా శ్రీ అనసూయ మాత ఆరాధన**
**జనవరి 12 - శ్రీ వివేకానంద జయంతి**
**జనవరి 14 - శ్రీ వివేకానంద జయంతి (తిథి ప్రకారము- పుష్య బహుళ సప్తమి)**
**జనవరి 16 - అవధూత శ్రీ రామిరెడ్డి తాత ఆరాధన**
**జనవరి 17 - భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి**
**జనవరి 27 - తాజుద్దీన్ బాబా జయంతి**

"శ్రీసాయి అనబడు జ్ఞాన సూర్యునికాంతి అందరిమీద ప్రసరిస్తుంది. అయితే వారెంత వివేక వైరాగ్యాలను, నిష్ఠ సబూరిలను సాధించారోనన్న దానిని బట్టి వారు ఆ సూర్యునికంత చేరువలోనే వుండి, అతడి ప్రభావాన్నంతగా గ్రహించగలుగుతారు. అయితే యిది కేవలం భౌతికమైన దగ్గర దూరాలు కావని గుర్తించాలి. తత్వతః దగ్గరవ్వాలి. ఒక మేలిమి బంగారుముద్దకు ప్రక్కనుంచబడినది కల్తీబంగారపు ముద్ద అయితే అది తత్త్వతః దూరంగా వున్నట్లే. మరొక బంగారపుముద్ద ఎంత దూరానవున్నప్పటికీ తత్త్వతః అది మొదటిదానికి చేరువ అవుతుంది. రేడియోసెట్టు భౌతికంగా ప్రసార క్షేత్రానికెంత దూరానవున్నా ఆ స్టేషన్ పెట్టినపుడు దానికి సమీపంలోనే వుంటుంది. ఆ వార్తాగ్రహణలో ఒకే స్టేషన్ పెట్టిన రెండు రేడియోసెట్లు వాటి దగ్గర దూరాలు వేరైనందున వాటి వార్తా గ్రహణలోని స్పష్టత మారినట్లు ఉత్తమాధికారియొక్క గురుభక్తి సేవాతీవ్రతల వ్యత్యాసంవలన వారి ఆధ్యాత్మిక పురోగతిలో స్వల్ప బేధాలుంటాయి. అందుకని మన హృదయం సాయిభక్తి అనే స్టేషనును ట్యూన్ చేసివుండేలాగ చూచుకోవడమే సాధన. అలా చూచుకోవాలంటే వారన్నిరీతుల బోధించిన దానిని చూచుకోవాలి."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# ధర్మ భ్రష్టత ఎలా ఆరంభమౌతుంది?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

"అహింసా పరమో ధర్మః", 'అహింసయే పరమ ధర్మము' అన్నది ఋషి వాక్యం. అయినా అహింస అంటే స్పష్టంగా అర్థం చేసుకోకపోతే అహింస పేరిట హింసాత్మకమైన అధర్మాన్ని ప్రబలనివ్వడమో, లేక ధర్మం పేరిట హింస చేయడమో జరిగి, ఆ రెండూ సార్థకం కాకుండా పోతాయి. ధర్మమే అహింస, అహింసే ధర్మము. హింసే అధర్మము. ఆది జరుగకుండా చూడడం కూడా అహింసే. అందుకే అహింస పరమ ధర్మమైనది.

మనకితరులు ఏమి చేయాలనుకొంటామో అదే మనం యితరులకు చేయడము, ఇతరులు మనకు ఏది చేయకూడదనుకుంటామో, మనమది యితరులకు చెయ్యకుండటం; ఇదే ధర్మమంతటికి మూలసూత్రమని భారత భాగవతాల నుండి మన ప్రాచీన గ్రంథాలన్నీ ముక్తకంఠంతో చాటాయి. ఈ సూత్రాన్ని- "ఆత్మవత్ సర్వభూతాని" "అన్ని జీవులనూ తనవలెనే చూచుకొనుట" అని ఋషులు పొందుపరచారు. ఇదే బుద్ధుడు చెప్పిన కర్మ అనే సూత్రం. "నీ సాటివారిని నీ వలెనే ప్రేమించు" అని క్రీస్తు చెప్పినది కూడా అదే. మిగిలిన ధర్మాలన్నింటి మాటున మణిహారంలో సూత్రంగా ఈ ధర్మమే ఆధారమయి నిలుస్తుంది. 'స్వధర్మము' అని చెప్పినదంతా సమాజంలోని వ్యక్తులందరిపైన ప్రీతితో సమిష్టి యొక్క శ్రేయస్సులో తన వ్యక్తిగతమైన శ్రేయస్సు యిముడ్చుకొని, ఆ ప్రకారం జీవించడమే ధర్మ శాస్త్రాలకు, విధినిషేధాలన్నిటికీ ఆధారం. అటువంటి ప్రేమచేత ప్రేరేపించబడి అత్యంతమయిన ప్రీతితో, శ్రద్ధతో ఆచరించడమే సద్ధర్మాచరణ. అయితే యిందుకు ప్రతి ధర్మసూత్రం యొక్క అర్థమూ తెలిసియుండాలి. ఎవరికి పైన తెలిపినటువంటి ప్రేమ వుంటుందో, వారికట్టి అవగాహన సహజంగానే కలుగుతుంది. అహింస, ధర్మసూత్రాల ఐక్యతే ప్రేమ. దీనినే భగవద్గీత దైవీసంపద, సత్వగుణము అని చెప్పింది. ఇది నిర్దుష్టంగా వున్నాకనే మనము ఆధ్యాత్మవిద్యకు అర్హులమవుతాము. అందుకు విరుద్ధమయినది రజస్తమో గుణాత్మకమైన అసురీసంపద. దాని వలననే మనిషి ధర్మ భ్రష్టుడవుతాడు.

సాటి జీవులపై ప్రేమవలన గాక, ధర్మాచరణ వలన మనపై గౌరవంతో ఇతరులు ప్రశంసించడమో, వారిపై అజమాయిషీ కోసమో లేక దానిపై మనకు లభించగల లౌకికము, పారలౌకికము అయిన లాభం వలననో ఆచరించడం ధర్మభ్రష్టతలో మొదటి మెట్టు. సాటివారిని తనవలెనే గాక తదన్యులుగా తలచినప్పటినుండి యిలాటి భావాలు ఆరంభమవుతాయి. సామాన్యంగా ఆ స్థితినుండి అసూయా ద్వేషాలతో పాటు అరిషడ్వర్గాలు పెచ్చుపెరిగి నేరప్రవృత్తి వరకు పతనావస్థ చెందుతుంది. శివుని జటాజూటం నుండి జారిన గంగ

***మిగతా 29వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 జనవరి-2023 సంచిక:09

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ధర్మ భ్రష్టత ఎలా ఆరంభమౌతుంది? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | ఆంగ్ల నూతన సంవత్సరాది - 2012 | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి సుజాత, శ్రీమతి కనకదుర్గ | 09 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 06. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 12 |
| 07. | భక్తవత్సలుడు | శ్రీమతి మల్లాది సుబ్బలక్ష్మి | 15 |
| 08. | మరికొందరు భక్తులు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 19 |
| 09. | మాతృదేవి దివ్య సన్నిధిలో దత్త జయంతి వేడుకలు!! | శ్రీమతి టి. పద్మావతి | 22 |
| 09. | మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి కృష్ణకుమారి | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి విజయలక్ష్మి | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : రూ. 10-00
సంవత్సర చందా : రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## ప్రశ్న :- స్త్రీలు బహిష్టు అయినప్పుడు యథారీతిగా ధ్యానము, పూజ చేయవచ్చునా?

**జవాబు** :-మానవులలో శరీరగతమైన జీవ క్రియలకు, మానసిక స్థితికి ఎంతో సన్నిహిత సంబంధమున్నది. రుచికరమైన పదార్థాన్ని చూచినపుడు లాలాజలము, ఒక్కొక్కప్పుడు జీర్ణకోశంలోని రసాలు శరీరంలో ఉత్పన్నమవుతాయి. అలానే ఆకలయినపుడు రుచికరమైన ఆహారపదార్థాలపైకి మనస్సు పోతుంది.

జపము, ధ్యానము మొదలగు ఆధ్యాత్మిక సాధనలను హృదయపూర్వకంగా చేసేటప్పుడు శరీరంలోని ప్రాణశక్తి ఊర్ధ్వగతిన పనిచేస్తుంది. అందుకే అట్టివారికి క్రమంగా జీర్ణకోశంలోని రసాలు తక్కువగా పనిచేయడం ఆరంభించి ఆహార పరిమితి క్రమంగా తగ్గుతుంది. అలాగే అధోగతిన బహిర్గతమయ్యే మలమూత్రాల ప్రమాణం కూడా తగ్గుతుంది. అందుకే భోజనానంతరం తీవ్ర ధ్యాన, జప, పూజాదులు చేయకూడదని శాస్త్రం. కారణం ఆహారం సరిగా జీర్ణంకాదు. అలానే మలమూత్ర విసర్జన సమయంలో గాని అందుకు కొద్ది ముందుగాని జపాదులు తీవ్రంగా చేయకూడదు. సాధ్యమైనంతవరకు ఇలాంటివి కాలకృత్యాలు తీర్చుకున్న తరువాతనే చేసుకోవాలని చెప్పారు.

స్త్రీలు బహిష్టు అయినపుడు అధోగతిన శరీరం నుండి ఎంతో మాలిన్యం వెడలిపోతుంది. (ఇక్కడ మాలిన్యమంటే శరీరానికి అవసరం లేని పదార్థమంతా అని అర్థం.) ఈ కారణంగానే శాస్త్రంలో ఆ సమయంలో పూజాదులు చేయకూడదని నిషేధించబడినది. మితంగా భగవన్నామస్మరణ, మహాత్ముల చరిత్రలు పారాయణ చేసుకోవడానికి ఎట్టి అభ్యంతరము లేదు.

కాకుంటే ఎట్టి శారీరక మానసిక స్థితులలో వున్నప్పుడు ఏఏ వస్తువులను, ప్రదేశాలను ఉపయోగిస్తామో, అట్టివి తిరిగి అటువంటి మానసిక స్థితులను మనలో ప్రేరేపిస్తాయని నిత్యానుభవాన్ని గమనిస్తే తెలుస్తుంది. పూజాపటాలున్న గదిలో లౌకిక వ్యవహారాలను గూడ సాగిస్తే క్రమంగా ఆ దైవరూపాలపై శ్రద్ధ, ఏకాగ్రత తగ్గడం మనం చూడవచ్చు. అందుకే ప్రత్యేకంగా పూజాగృహాలు, దేవాలయాలు అవసరమయ్యాయి.

అలానే బహిష్టు అయినప్పుడుగూడ తక్కిన విధములైన మలవిసర్జనల విషయంలోలాగనే మనము నిత్యము జీవించే గృహానికి దూరంగా వుండాలని, అప్పుడు వాడిన వస్తువులను శుభ్రం చేయకుండా వాడకూడదని చెపుతారు.

ఒక ప్రాణి శరీరంలోనూ మనసులోనూ జరిగే ప్రాణక్రియలకు సమీపంలోని జీవులపై ప్రభావముంటుందని ఇటీవల సోవియట్ రష్యా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సైకోట్రానిక్స్ సమావేశములో ఋజువు చేయబడ్డది. అందుకే మలమూత్ర విసర్జన చేసినవారివలెనే బహిష్టు అయిన స్త్రీల యొక్క స్పర్శనం, సామీప్యాన్ని శాస్త్రాలు నిషేధించాయి.

మలమూత్ర విసర్జనచేసే సమయంలో ప్రశాంతంగా, మౌనంగా వుండాలంటుంది శాస్త్రం. మనోవ్యాపార మధికమయితే ఆ ప్రకృతి క్రియలు నిర్దుష్టంగా జరుగక శరీరంలో దోషం ఏర్పడుతుందని, అంతేకాక క్రమంగా అదే అలవాటుగా మారుతుందని భావం. అలానే బహిష్టు అయిన స్త్రీకి కూడ గృహ సమస్యల గూర్చిన ఎట్టి తీవ్ర మనోవ్యాపారం తగదు. అందుకుకూడ అట్టివారిని ఇంటికి దూరంగా వుండమంటారు. అప్పుడు భర్తను దర్శించితే వారిలో కామం, మమకారాది భావాలవంటి వ్యాకులత కల్గవచ్చని అలా హెచ్చరించారు. •

(జనవరి 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)

# ఆంగ్ల నూతన సంవత్సరాది - 2012

### *పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

ఇది ఆంగ్లేయుల నూతన సంవత్సరమైనప్పటికీ మనం దీనిని చేసుకోవడానికి అలవాటుపడ్డాము గనుక చేసుకుంటున్నాము. అంతేగాక మనము మన తెలుగు సంవత్సరాలు, తిథులు గాక ఆంగ్ల తేదీలనే, సంవత్సరాలనే వాడుతున్నాముగూడ.

శ్రీ సాయిమాస్టర్ భక్తులందరికీ గడిచిన సంవత్సరం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కారణం గడిచిన సంవత్సరంలో మనము అతి విశిష్టమైన, అత్యంత ప్రధానమైన నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. అదే మన ప్రియతమ పూజ్యశ్రీ మాస్టరుగారి 75వ జన్మదిన సందర్భంగా కృతజ్ఞతామహోత్సవం జరుపుకోవాలనే సంకల్పం కలగడము, నిర్ణయించుకోవడమూ జరిగింది. ఇంతటి శుభకరమైన విషయం మరొకటి ఏమున్నది?

పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞత తెలుపుకోవడానికి మనం అనేక మార్గాలను ఇంతకు ముందే ప్రస్తావించుకున్నాము. అయితే మనం ఎంత చేసినా ఆయనకు కృతజ్ఞత తెలుపుకోవడానికి సరిపోదేమో! కనుక ఆయన మనకు చేసిన శ్రేయస్సుకు కృతజ్ఞతగా యింకా యింకా చేస్తూనే వుండాలి.

గురువుకు కృతజ్ఞతగా తను, మన, ధనాలను సంపూర్ణంగా సమర్పించుకోవాలని పెద్దలు చెబుతారు. అయితే ఈ సమర్పించుకోవడంలో తరతమ స్థాయిలుంటాయి. పూర్తిగా సర్వసమర్పణ చేసుకోలేని స్థాయి మనది. అయితే మనం ఏమేమి ఎలా సమర్పించుకోవాలి? దీనికి కొలబద్ద ఏమిటి?

ఈ విషయంలో ఎవరికి వారే కొలబద్ద. కారణం ఎవరి పరిస్థితులు, మనస్థితులు వారివి. అందుకని ఎవరినీ ఎవరితోనూ పోల్చడానికి వీలులేదు. కారణం ఒకడు ఒకానొక పరిస్థితిలో పూర్తి ధ్యాస పెట్టలేకపోతున్నాడని అనుకుందాము. ఆ పరిస్థితిలో వుంటే మనమెలా వుండేవాళ్ళమో మన ఊహకు అందదు. ఒకవేళ ఇలా వుండేవాళ్ళము అని అనిపించినా నిజంగా ఆ పరిస్థితిలో వున్నప్పుడు మన ప్రతిస్పందన వేరుగా వుండవచ్చు. అందుకని ఎవరితో ఎవరినీ అంచనా వేయడానికి వీలులేదు. కనుక మన సమయాన్ననుసరించి మనం నిరంతరం ఆయన స్మరణ చేసుకోవడానికి ప్రయత్నించాలి. మనలోని బలహీనతలను తొలగించుకోవడానికి ప్రయత్నిస్తూ వుండాలి. ఇది నియమంగా పెట్టుకోవాలి.

గురువుకు తను, మన, ధనాలను సమర్పించుకోవాలని అనుకున్నాము.

ఇందులో మొదటిది తనువుతో, అంటే శరీరంతో చేయగలిగిన వాటిని చేయడం. శరీరంతో ఏ విధమైన సేవయైనా చేయవచ్చు. గురువు యొక్క సేవ, గురు సన్నిధిలోని సేవ మాత్రమే గాక, ఇతరులకు శరీరంతో చేయగలిగిన ఎటువంటి సహాయమైనా చేయవచ్చు.

రెండవది మనస్సు. అంటే మనస్సును భగవంతునికర్పించడం. అంటే నిరంతరం మన మనస్సును ఆయన ధ్యాసలో వుండేలా చూసుకోవడం. ఏపని చేసినా అది భగవంతుని సేవగా భావించి చేయడము. తనకు ఏది లభించినా భగవంతుని ప్రసాదమని భావించడము, జీవితంలో సంభవించే కష్టనష్టాలను ఆయన మనకు



శ్రేయస్సు చేకూర్చడానికే చేస్తున్నారని భావించడము – ఇలా అన్ని విషయాలలోనూ ఆయన పరంగా ఆలోచించడము అభ్యసించాలి.

మూడవది ధనము. మన పరిస్థితిని బట్టి శక్తి కొలది ధనం గురువుకు సమర్పించుకోవడం. అంటే గురువుకు గానీ, గురుపరంగా జరిగే ఏ ఇతర కార్యక్రమాలకైనా ధనాన్ని సమర్పించుకోవడము. గురుసేవగా భావించి పేదలకు సహాయం చేయడము, కష్టాలలో వున్నవారిని ఆదుకోవడము గూడ గురువుకు సమర్పించుకోవడం క్రిందకే వస్తుంది.

కొందరు ఎంతో చేస్తూగూడ ఏమీ చేయలేదని అనుకుంటూ వుంటారు. మరి కొందరు ఏమీ చేయకుండాను కొద్దిగా చేసి గూడ ఎంతో చేసామని అనుకుంటూ వుంటారు. అలా ఎంతో చేస్తున్నామని అనుకునే వాళ్ళంతా ఏమి చేసినా తమ గొప్ప కోసం చేస్తున్నారన్నమాట. అందువలన అట్టి పని వారికి అహంకారం ప్రబలడానికి దోహదకారి అవుతుందే తప్ప ప్రయోజనమేమీ వుండదు. అంతేగాక అట్టి అహంకారం వల్ల తనకంటె వేరెవరైనా ఎక్కువ చేసారని ఎవరైనా అంటే వారిపట్ల అసూయ కలిగి, అది ద్వేషంగా మారే అవకాశం గూడ వున్నది.

ఇతరులకు ఏదైనా చేయాలనే ఆసక్తిగలవారు తాము చేస్తున్నామని అనుకోరు. ఇంకా ఎంత చేయగలమనే ఆలోచిస్తూవుంటారు. వారికి చేయాలనే ఆరాటం తప్ప ఎంత చేసామనే ఆలోచన వుండదు.

నిజంగా ఇది భగవంతుని గుణం. అవతార పురుషుల గుణం. భగవద్భక్తుల గుణం, సజ్జనుల గుణం, సాధు సత్పురుషుల గుణం, సద్గురువుల గుణం. అందుకే అట్టి వారిని ఆశ్రయించిన మనం వారి గుణాలను అలవరచుకోవాలి. అట్టివారి అనుగ్రహం పొందాలంటే అట్టి గుణాలను అలవరచుకోక తప్పదు గూడ.

అందుకని మన మనస్సును సరిగా వుంచుకోవాలి. మనస్సును సరిగా వుంచుకోవడానికి పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన వాటిని కొన్నింటిని స్మరించుకొందాము.

ముఖ్యంగా మనస్సును సరిగా వుంచుకోవడానికి అంటే మనస్సు సరియైన ఆలోచనలు చేయడానికి వివేకంతో ఆలోచించడమనేది అతి ప్రధానమైన అంశమని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. వివేకంతో ఎలా ఆలోచించుకోవాలో గూడ ఆయన అనేక విధాలుగా చెప్పివున్నారు.

అంతేగాక, రోజంతా బాబా ధ్యాసలో ఎలా గడపాలో గూడ ఆయన స్మరణ, మనన, ధ్యాన పద్ధతుల ద్వారా తెలిపారు. వీటిని ఆయన రచించిన ధ్యానయోగ సర్వస్వంలో చూడవచ్చు.

దానమెలా చేయాలో, అసలు ఏ పనైనా ఏ భావంతో చేస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయో, సరియైన ఫలితాలు రావాలంటే కర్మనెలా చేయాలోగూడ ఆయన ఎన్నో ప్రవచనాల ద్వారా వివరించారు.

ఆయన తమ వద్దకు వచ్చిన వారితో గురు శిష్య సంబంధమువలెగాక సాధారణ తండ్రిలా తాపత్రయపడి హితవు బోధించారు. ఆయన మనకోసం, ఈ ప్రపంచం కోసం పడ్డ తాపత్రయానికి బదులుగా మనమేమి సమర్పించుకుంటే సరిపోతుంది?

ఇక్కడ శ్రీ గురుచరిత్రలోని 11వ అధ్యాయంలో పూజ్యశ్రీ మాస్టరుగారు 'ప్రస్తావన'లో వ్రాసిన దానిని ప్రస్తావించుకోవడం ఎంతో అవసరం:

"శ్రీ పాదస్వామి గాని, శ్రీ నృసింహ సరస్వతీ స్వామి గాని, తాము భగవదవతారములని లోకానికి చాటుకోలేదు.

శ్రీ రాముడు గూడ 'ఆత్మానం మానుషం మన్యే', 'నేను మానవుడననే తలుస్తున్నాను' అన్నాడు. శ్రీ కృష్ణుడు తాము భగవదవతారమని అర్జునుడి వంటి అంతరంగికులకు కొద్దిమందికి మాత్రమే చెప్పాడు గాని లోకానికి చాటలేదు. దీనినిబట్టి నిజమైన అవతార పురుషుడు తన నిజతత్త్వాన్ని లోకానికి చాటుకోడని తెలియాలి. వేదవ్యాసులవంటి సత్యద్రష్టలు కొద్దిమంది మాత్రమే ఈ రహస్యాన్ని గుర్తించి లోకానికి తెలియబరచారు.

ఈ అవతార మూర్తులందరూ తమ నిజమైన విశ్వరూపాన్ని అంతరంగికులకు ప్రసాదించి అనుభవపూర్వకంగా తమ దైవత్వాన్ని నిరూపించారు. అలాగాక పౌండరీక వాసుదేవుని వంటి కీర్తికాములు మాత్రమే తాము అవతార పురుషులమని లోకాన్ని నమ్మింపజూచారు. అవతార పురుషులందరూ సద్గురువులనాశ్రయించి సత్సాంప్రదాయాన్ని పాటించారేగాని, తమకట్టి ఆలంబనలు అనవసరమని, తాము సర్వధర్మాలకూ అతీతులమనీ చెప్పి స్వేచ్ఛాచారులు గాలేదు.

అవతార పురుషులందరిలాగే వీరిద్దరూ తాము జన్మతః పరిపూర్ణులైనప్పటికీ వినమ్రులైన సాధకులవలెనే ప్రవర్తించారు గాని, సిద్ధులమని విఱ్ఱవీగలేదు.

వీరు దివ్యలీలలను ప్రదర్శించినప్పటికీ అవి ఆర్తులను రక్షించేవిగాను, అర్థార్థులను పోషించేవిగాను, నిర్దుష్టమైన ఆధ్యాత్మ భావనను భక్తులకు ప్రసాదించి, వారిని మోక్షోన్ముఖులుగా చేసేవిగా మాత్రమే వున్నాయి. కేవలం తమ శక్తి సామర్థ్యాలతో లోకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచి తమకు కీర్తిని చేకూర్చే సాధనాలైన చిల్లర చమత్కారాలు వారెన్నడూ ప్రదర్శించలేదు".

పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన పై విషయాలన్నీ ఆయనకు అక్షరాలా సరిపోతాయని ఆలోచిస్తే మనకర్థమవుతుంది. ఆయన గూడ సాధకునిగా సాధన చేసారు. సాధారణ గృహస్థుగా మెలగి అందులోని కష్టనష్టాలను ఎలా ఎదుర్కోవాలో మనకు తెలియజేసారు. ఆయన అవతార పురుషుడనడానికి ఈనాటి సాయి ప్రభంజనమే తార్కాణము. ఆయన గూర్చి మహాత్ములు చెప్పిన వాక్యాలే ప్రమాణము.

ఆయనకేమీ అవసరం లేకపోయినా మనకోసం ఆదర్శ జీవితాన్ని గడిపారు. అందుకని మనం ఆయన జీవితాన్ని నిశితంగా గమనిస్తూ అట్టి జీవితాన్ని గడపడానికి ప్రయత్నించాలి. అప్పుడు అడుగడుగునా ఆయన మన వెంట వుండి మనలను సరియైన మార్గాన నడిపిస్తారు. అంతకంటే మనకు కావలసినది ఏమున్నది? ఇంతకుమించి మననుంచి ఆయన ఆశించేదేమున్నది?

'కృతజ్ఞతకు మరోపేరు సాయి' అని పూజ్యశ్రీ మాస్టరుగారన్నారు. అలాగే కృతజ్ఞతకు మరో పేరు పూజ్యశ్రీ మాస్టరుగారు గూడా. శ్రీ సాయినాథుడు తమకు ప్రసాదించిన ఆధ్యాత్మికానుభవానికి కృతజ్ఞతగా ఆయన తమ జీవితాన్నే సాయి సేవకు అంకితం చేసారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చేసినట్టు మనం గూడ సేవ చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. దయ, సహనము, పరోపకారము, సద్గ్రంథపఠనము, శ్రవణ, మనన, నిధి ధ్యాసనము, సత్సంగము, భజన, సద్గురు సమాగమము, మహాత్ముల దర్శనము సాధ్యమైనంతవరకూ వీటన్నింటినీ చేయడానికి ప్రయత్నించాలి.

ఇంతకూ మనం ముఖ్యంగా తెలుసుకోవలసినది ఒక్కటే. ఇలాగే ఎన్నో నూతన సంవత్సరాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఎన్నో లెక్కకుమీరిన జీవులిలాగే పుడుతూ, గిడుతూ వుంటాయి. అలాగే మనమూను. మన పెద్దలు చెప్పిన ప్రకారమయితే ఇప్పటికి మనం ఎన్ని జన్మలెత్తి వుంటామో, ఇలాగే ఎన్ని నూతన సంవత్సరాలు జరుపుకున్నామో! కానీ ఇప్పుడు మనమెత్తిన జన్మకొక ప్రత్యేకత వున్నది. అదే పూజ్యశ్రీ మాస్టరుగారు మనకు గురువుగా లభించడం. మన జీవితాలను సార్థకం చేసుకోవడానికి ఆయన చెప్పినటువంటి సులభతరమైన సూత్రాలను మరెవరూ వివరించి వుండలేదేమో! అందుకే ఇట్టి అమూల్య అవకాశాన్ని మనం జారవిడుచుకోకూడదు. అలా జారవిడుచుకుంటే మనంతటి వివేకహీనులు మరొకరు వుండరేమో! మన జన్మజన్మలన్నింటిలోనూ ఆయన వెంట మనముండాలన్నా, మన వెంట ఆయన వుండాలనుకున్నా ఆయన చెప్పిన విధంగా, తమ గురువు చెప్పినట్లు ఆయన చేసిన విధంగా మనమూ శక్తి వంచన లేకుండా కృషి చేయవలసిన అవసరమున్నది.

కనుక ఈ నూత్న సంవత్సరంలో ఆయన చెప్పిన విధంగా నడుచుకోడానికి ప్రయత్నిద్దాము. లౌకికంగా కృతజ్ఞతా మహోత్సవము మహావైభవంగా జరుపుకున్నప్పటికీ, ఆంతరంగికంగా జరుపుకోవలసిన కృతజ్ఞతా మహోత్సవం మాత్రం ఇదే!

# మాతృదేవి స్మృతులు

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని బాపట్ల వాస్తవ్యులు శ్రీమతి సుజాతగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

మేము బాపట్లలో వివేకానందకాలనీలో వుంటాము. 2012 వ సంవత్సరంలో మా ఇంటి యజమాని ద్వారా సత్సంగాలు పరిచయమయ్యాయి. మేము సత్సంగాలకు హాజరవుతూ పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన గ్రంథాలు పారాయణ చేస్తూవుంటే మాకున్న ఎన్నో సమస్యలను సమర్థ సద్గురువులైన శ్రీ సాయిబాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు పరిష్కరించారు. చాలా అనుభవాలు కూడా ఇచ్చారు. కానీ నాకు ఎప్పుడూ, 'పూజ్యశ్రీ అమ్మగారు ఎటువంటి అనుభవమివ్వలేదే?!' అనే కొరత వుండేది.

2021 మార్చి 7 వ తేదీన తిథి ప్రకారం జరిగే కల్యాణోత్సవానికి పూజ్యశ్రీ అమ్మగారి కోసమని ప్రేమతో ఒక గులాబీ పువ్వును ఇంటినించి సత్సంగమందిరానికి తీసుకువెళ్లాను. వేదిక మీద వున్న కుర్చీలో పువ్వు పెట్టి లోపలకు వెళ్లి వచ్చేసరికి పువ్వు కనిపించలేదు. పూజ్యశ్రీ అమ్మగారికి పువ్వు సమర్పించుకోలేకపోయానే అని చాలా బాధపడ్డాను. కానీ అదే రోజు రాత్రి పూజ్యశ్రీ అమ్మగారు అదే పువ్వును ధరించి నాకు స్వప్న దర్శనమిచ్చారు. నేను చాలా సంతోషించాను. పూజ్యశ్రీ అమ్మగారు కూడా మళ్ళీ నాకొక పువ్వును ప్రసాదంగా ఇచ్చారు. నేను ఎంతో ఆనందంతో ఆ పువ్వును కళ్ళకద్దుకుని తలలో పెట్టుకున్నాను. అంతటితో నా స్వప్నం ముగిసింది. ఇది జరిగిన రెండు నెలల తరవాత మావారికి కరోనా వచ్చింది. నేను, పిల్లలు మహాపురుషుడు గ్రంథం పారాయణ చేసి పూజ్యశ్రీ అమ్మగారిని ప్రార్థించాము. పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో మావారికి తగ్గిపోయింది. ముందుగానే పూజ్యశ్రీ అమ్మగారు నాకు పువ్వును ప్రసాదించి మావారికి ప్రాణభిక్ష పెట్టారు.

అనుభవం ఇవ్వలేదనుకున్న నాకు పూజ్యశ్రీ అమ్మగారు జీవితానికి సరిపడా అనుభవాన్ని ప్రసాదించారు. ఆపద్బాంధవురాలైన పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లికి అనంతకోటి కృతజ్ఞతాంజలులు సమర్పించుకుంటున్నాను.

*ఓం ఆపద్బాంధవాయై నమః!*

***-శ్రీమతి సుజాత***

---

బ్రహ్మపురి సత్సంగానికి చెందిన శ్రీమతి గుత్తుల కనకదుర్గ గారు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని ఇలా తెలియచేస్తున్నారు...

మాది ఉమ్మడి కుటుంబం. చిన్న, పెద్దా అంతా కలిపి మొత్తం 11 మంది కుటుంబసభ్యులం కలిసి వుంటాము. వారిలో 85 సంవత్సరముల వృద్ధులనుంచి 15 నెలల పసిబిడ్డ వరకూ వున్నారు. వారిలో ఏడుగురికి కరోనా సోకింది. అది రావడానికి రెండు రోజుల ముందు తెల్లవారు ఝామున నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో మా సత్సంగ సభ్యురాలైన గణికమ్మ, "పూజ్యశ్రీ అమ్మగారు వస్తున్నారు!" అంటూ హడావిడిగా

***మిగతా 18వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## తొమ్మిదవ ప్రసంగము

### ప్రకృతి భేదాలు

భగవద్గీతలోని తొమ్మిదవ అధ్యాయంలో ప్రకృతి మూడు రకాలుగా చెప్పబడినది. దైవ, రాక్షస, అసుర ప్రకృతులు. కానీ 16వ అధ్యాయంలో రెండు రకాలుగాని చెప్పబడినది. దైవ, అసుర ప్రకృతులు. అంటే రాక్షస ప్రకృతి అసుర ప్రకృతిలో ఒక భాగం అవుతున్నది.

మూల శృతిలో *'ద్వయాః ప్రాజాపత్యాః దేవాశ్చా సురాశ్చ'* అని చెప్పబడింది. అంటే ప్రజాపతికి దేవతలు, అసురులు అనే రెండు తెగల సంతానము వున్నదని అర్థము. ఇలా దేవతలను, అసురులను నిర్దేశించిన శృతిని అనుసరించి వారి ప్రకృతిని బట్టి సామాన్యంగా ప్రకృతిని రెండు భాగాలుగా చేశారు. అసురప్రకృతి నుండి రాక్షసప్రకృతిని వేరుచేస్తే ప్రకృతి మూడు రకాలు. అసురప్రకృతి రాగ ప్రధానమైనది. రాగము వున్నచోట ద్వేషము వుండి తీరుతుంది. ధనము మొదలైన వాటి మీద కోరికలు గల మానవుడు వాటిని సంపాదించడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో విఘ్నాలు కలిగితే ద్వేషము కలుగుతుంది. అది రాక్షస ప్రకృతి.

16వ అధ్యాయంలోని మొదటి మూడు శ్లోకాలలోనూ దైవ ప్రకృతి ప్రతిపాదించబడింది. నాలుగవ శ్లోకంలో రాక్షస ప్రకృతిని భాగంగా చేసి అసుర ప్రకృతి వర్ణించబడింది.

*శ్లో॥ దమ్భో దర్పో అభిమానశ్చ*
*క్రోధః పారుష్యమేవ చ ।*
*అజ్ఞానం చాభిజాతస్య*
*పార్థ సంపద మాసురీమ్ ॥*

***భావం:*** రజస్తమోగుణాలతో నిండిన అశుభకరములైన వాసనల ద్వారా జన్మించిన పురుషుడు దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పారుష్యము, అజ్ఞానము అనే దోషాలనన్నింటినీ పొందుతాడు.

వీటిలో దంభము అసురగుణము. అది రాగము వల్ల పుడుతుంది. దర్పము ద్వేష ప్రధానమైనది. కాబట్టి రాక్షసగుణము. దానిలో తనకంటే గొప్పవాడిని తక్కువవాడిగా భావించి తన గొప్పతనాన్ని ఇతరుల ముందు నిలబెట్టుకోవాలని వృత్తి (స్వభావము) వుంటుంది. అభిమానమంటే నేను అందరికంటే ఉత్తముడిని, పూజ్యుడిని అనే అహంభావం కలిగి వుండటం. అది రాగ ప్రధానమవడం

వలన అసుర గుణము. పౌరుష్యము అంటే కాఠిన్యము. ఇది రాక్షస గుణము. ఇది ద్వేషము వలన పుడుతుంది. ఈ దోషాలన్నింటికీ మూల కారణము అజ్ఞానము.

భగవద్గీతలో ఇలా అసురప్రకృతిలో రాక్షసప్రకృతి అంతర్భాగంగా చేయబడింది. కాబట్టి భగవంతుడైన కృష్ణుడు ఇలా అన్నాడు:

*'దైవీ సంపద్విమోక్షాయ నిబంధయాసురీమతాః'* – అంటే దైవసంపద మోక్షానికి, అసురసంపద బంధనానికి కారణాలు.

## భగవద్గీత ప్రకారము దైవ సంపదకు అవసరమైన ముఖ్య గుణము

దైవసంపదకు పరమాత్మపట్ల ఆస్తికబుద్ధి కలిగి వుండడం ప్రధాన లక్షణము. ఆస్తికుడై అనన్యభావంతో భగవద్భక్తి కలవాడియందు దైవ సంపదకు చెందిన గుణాలన్నీ వుంటాయి. అటువంటి దుర్మార్గుడు కూడా సన్మార్గుడు అవుతాడు.

*శ్లో॥ అపి చేత్సుదురాచారో*
*భజతే మామనన్యభాక్ ।*
*సాధురేవ స మన్తవ్యః*
*సమ్యక్ వ్యవసితో హి సః ॥*

***భావం:*** అత్యంత దురాచారపరుడైనా అనన్యచిత్తంతో ఒకటే అయిన పరమాత్ముని యందు మనస్సు నుంచి భజించినట్లైతే అతనిని సాధువుగా అంగీకరించవచ్చు. ఎందుకంటే అతని దృఢ సంకల్పం (నిశ్చయము) ఉత్తమమైనది.

*శ్లో॥ క్షిప్రం భవతి ధర్మాత్మా*
*శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి ।*
*కౌన్తేయ ప్రతిజానీహి*
*న మే భక్తః ప్రణశ్యతి ॥*

***భావం:*** అతడు వెంటనే ధర్మాత్ముడౌతాడు. అతనికి వెంటనే శాశ్వత శాంతి కలుగుతుంది. నా భక్తులు నశించరు – ఇది నిశ్చయము.

వేమన్న దక్షిణ దేశపు ఒక జమిందారు కుమారుడు. ఒక సంవత్సరం పిల్లవాడుగా ఉన్నప్పుడు అతని తల్లిదండ్రులు మరణించారు. అతని అన్నగారు అతనికంటే 20 సంవత్సరాలు పెద్దవాడు. అతడు వేమన్నను పెంచి పెద్ద చేశాడు. అతని వదినగారు అతడిని తన సొంత కొడుకులాగా చూసుకునేది. వేమన్న పెద్దవుతున్నకొద్దీ విచ్చలవిడిగా తిరుగుతూ చెడిపోసాగాడు. దుర్మార్గుడై, ఒక వేశ్యకు బానిసయ్యాడు. ఎల్లప్పుడూ అతడు ఆ వేశ్య ఇంటి దగ్గరే వుండేవాడు. ఇంటిలోని ధనాన్నంతా పాడుచేస్తుండేవాడు. ఒకటి రెండుసార్లు వదినగారిని అడిగి ఆ వేశ్య కోసం ఆభరణాలు కూడా తీసుకెళ్లాడు. ఇంకొకసారి అతడు ఆ వేశ్య కోసం తన వదినగారి ముక్కు నత్తు అడిగాడు. అప్పుడు ఆమె, "దీనిని నేను నీకు ఇస్తాను. ఆమె వస్త్రాలన్నీ విడిచి, తన ఆభరణాలన్నింటినీ తీసివేసి నగ్నముగా ఈ నత్తు తీసుకోవడానికి వస్తుందా? ఆమె అలా చేసేటట్లయితే నేను ఈ నత్తును యిస్తాను. అందుకు ఆమె సిద్ధమేనా?" అని అడిగింది.

వేమన్న ఇలా అన్నాడు, "అందులో గొప్ప ఏముంది?"

ఆ తరువాత అతడు ఆ వేశ్య అంగీకారాన్ని తన వదినకు తెలిపాడు. ఆమె తన నత్తును వేమన్నకు యిస్తూ యిలా అన్నది:-

"నీవు జాగ్రత్తగా పరిశీలించి చూడు. ఆమె శరీరంలో రక్తము, మాంసము, ఎముకలు తప్ప మరేమైనా వున్నాయా? అతి జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నత్తును యివ్వు."

అలా ఆ వేశ్యను చూడగానే వేమన్నకు ఆమె శరీరము మాంసపిండము, అస్థిపంజరము మాత్రమే అని తోచింది. వస్తువును నిజరూపంలో చూడగానే దోషదృష్టి పోయింది. ఆమెకు నత్తును యివ్వగానే అతడికి వైరాగ్యము కలిగింది. ఇక వేమన్న మరల ఇంటికి రాలేదు. అతడు అరణ్యాలలోకి వెళ్లిపోయాడు. అక్కడ ఒకానొక యోగిపుంగవుని కృపాకటాక్షం చేత ఆ దుర్మార్గుడు సన్మార్గుడయ్యాడు. ఇలాగే దుర్మార్గుడై భగవంతుని పట్ల అనన్యభావము వుంచడం ద్వారా సిద్ధపురుషుడయ్యాడు. పరమాత్మయందు ఆస్తికబుద్ధి దైవసంపద పొందడానికి ముఖ్యము.

ఆ తరువాత శ్రీ ప్రకాశానందస్వామివారు భిక్ష చేసి జామ్ నగర్ కు వెళ్లారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

సరస్వతీపూజ రోజున పూజ, సంకీర్తన అనంతరం జరిగిన అన్నదాన కార్యకమంలో అమ్మ కూడా వడ్డన చేశారు. భిక్షగాండ్లలో ఒక కుష్టురోగి వున్నాడు. అమ్మ అతనిని తన దగ్గర కూర్చోబెట్టుకుని తన స్వహస్తాలతో ఎంతో ప్రేమతో భోజనం తినిపించారు. భిక్షగాండ్లందరూ భోజనాలకు కూర్చున్న సమయంలో వున్నట్లుండి ఆకాశం మేఘావృతమై అంతటా కారుచీకట్లు క్రమ్ముకున్నాయి. కుంభవృష్టి కురిసే సూచనలు కనిపించటంతో భక్తులంతా సంతర్పణ కార్యక్రమానికి యిబ్బంది కలుగుతుందేమోనని ఆందోళన చెందారు. అమ్మ తన గది నుండి బయటకు వచ్చి, కొంతసేపు ఆ మైదానప్రదేశంలో అటు యిటూ తిరిగారు. భోజనాలు సవ్యంగా, ఏ ఆటంకమూ లేకుండా పూర్తి అయినాయి. ఆ వెంటనే వర్షం ఆరంభమై అంతటా కుంభవృష్టి కురిసింది. ఆ రాత్రి అమ్మ భిక్షగాండ్లు కూర్చున్న ప్రదేశంలో భక్తులతో కలసి కూర్చుని భోజనం చేశారు. తర్వాత అమ్మ షాహ్-బాగ్ వెళ్ళిపోయారు.

ఢాకా లోనే 'లా' చదివే విద్యార్థి ఒకడు సరస్వతి పూజలో పాల్గొన్నాడు. అమ్మను మొదటిసారిగా ఆ సమయంలోనే అతడు దర్శించుకొనటం జరిగింది. శ్రీ ఆనందమయి అమ్మ సాక్షాత్తూ పార్వతి మాతగా అతనికి అనిపించి, అమ్మపై అతనికిఅంతులేనిభక్తిఅంకురించింది. ఎలాగైనాసరే ఆ మరునాడు అమ్మను పూజించుకోవాలని సంకల్పించి ఉదయాన్నే పువ్వులు, పూజాద్రవ్యాలు సేకరించి అమ్మను ధ్యానిస్తూ తన గదిలోనే రోజంతా గడిపాడు. అతని కోరిక తెలుసుకున్న అతని తోటి విద్యార్థులు, మిత్రులు అతనిని షాహ్-బాగ్ కు అమ్మ వద్దకు తీసుకువెళ్లారు అతడక్కడ అమ్మను పూజించి చరణధూళి ప్రసాదించవలసిందిగా అమ్మను ప్రార్థించాడు. ఎంతోసేపటి తరువాత అమ్మ అతనికి చరణధూళిని ప్రసాదించారు. అదే సమయంలో అక్కడ వున్న యితర భక్తులకు కూడా



అమ్మ పాదధూళిని తీసుకునే అదృష్టం కలిగింది. ఆ యువకుడు ఆ రోజంతా అమ్మ సన్నిధిలోనే వున్నాడు. మరునాటి మధ్యాహ్నం అమ్మ పాదధూళిని మరొకసారి తీసుకుని వెళ్ళిపోయాడు.

అప్పటివరకు అమ్మ ఎప్పుడూ ఎవరికీ కూడా తన పాదధూళిని ప్రసాదించి వుండలేదు. అయితే అప్పటినుండి ఆ విద్యార్థి ఏ రోజులలోనైతే అమ్మ పాదధూళిని తీసుకోవడం జరిగిందో, ప్రతినెలా ఆ రెండు రోజులు ఐదు నిమిషముల

పాటు అమ్మ భక్తులకు తన పాదధూళిని ప్రసాదించటం ప్రారంభమయింది.

అమ్మ ఢాకా షాహ్-బాగ్ తోటకు వచ్చిన తర్వాత ఆమె యొక్క దివ్యత్వం జనులకు వెల్లడయింది. ఎందరో భక్తులు అమ్మను దర్శించి తమ బాధలు, తమ కోరికలు చెప్పుకునేవారు. అమ్మ ఆశీస్సులతో వారి అభీష్టాలు నెరవేరేవి. ఒకసారి ప్రమథ బాబు అనే అమ్మ భక్తుని కుమారుడైన ప్రతుల్ బాబు అమ్మతో, "అమ్మా, ఈరోజు నేను పాఠశాలలో పరీక్షకు హాజరు కావలసివున్నది. కానీ నా శరీర పరిస్థితి ఏమీ బాగాలేదు. నాకు జ్వరం వచ్చేటట్లుగావుంది. పరీక్ష వ్రాసేంత వరకైనా నాకు జ్వరం రాకుండా కాపాడమ్మా" అని ప్రార్థించాడు. అమ్మ ఆశీర్వదించారు. అతడు ఏ బాధా లేకుండా పరీక్షలు వ్రాయగలిగాడు. అయితే ఆ రోజంతా అమ్మ జ్వరంతో బాధపడ్డారు.

శ్రీ ఆనందమయి అమ్మకు చిన్ననాటి నుండి అప్పుడప్పుడు శరీరంలో అప్రయత్నంగా యోగక్రియలు, యోగాసనాలు ప్రకటమవుతుండేవి. వాటి గురించి చెపుతూ అమ్మ, "అటువంటి స్థితిలో చిత్ర విచిత్రరీతులలో వివిధ భంగిమలలోకి శరీర అవయవాలు వంగిపోతుండేవి. ఆ స్థితిని తలచుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. 'శరీరం అన్ని రకాలుగా ఎలా మెలికలు తిరగ గలుగుతుంది?' అని కూడా అనిపిస్తుంది. శారీరికశ్రమ చేసేవారికి యోగాసనాలు వేయటం సులభంగా వుంటుంది. నేటికాలంలో ప్రజలు సుఖభోగాలతో, విలాసాలతో మునిగితేలుతున్నారు. అటువంటి వారికి యోగాసనాలు వేయటం కష్టతరంగా అనిపిస్తుంది. తగినంత కదలికలేక వారి శరీర అవయవాలు తుప్పుపట్టి వుంటాయి. ప్రతివారికి కొంత శారీరక శ్రమ అనేది ఎంతో అవసరం" అనేవారు.

సిద్దేశ్వరి అనే ఊరిలో ఒక పెద్ద కాళికాలయం వుంది. ఆ ఆలయం వద్ద ఒక పెద్ద రావిచెట్టు వుంది. చిత్రమేమంటే ఆ చెట్టు వేళ్ళతోసహా పెకలింపబడి వున్నప్పటికీ అది ఎండిపోకపోగా అంతకంతకూ ఆ వృక్షం పెరిగి పెకలించి వేయబడిన వేళ్ళనుండి కూడా పిలకలు వచ్చి వృక్షాలుగా విస్తరించడం జరిగింది. ఈ విషయమై శ్రీ ఆనందమయి అమ్మ ఒకసారి యిలా చెప్పారు:బాజీత్పూర్ లో ఉండగా ఒకసారి నా కళ్ళ ముందు ఒక పెద్ద రావి చెట్టు స్పష్టంగా కనిపించింది మేము షాహ్-బాగ్ వచ్చిన తర్వాత నాకు ఆ రావిచెట్టు దర్శనమిచ్చిన విషయం భోలానాథ్ గారికి చెప్పి ఆ చెట్టు ఎక్కడ వుంటుందని అడిగాను. వారు కూడా తనకు తెలియదన్నారు. తర్వాత కొన్నాళ్లకు బావుల్ బాబు అనే భక్తుడి ద్వారా తెలియటం జరిగింది. బావుల్ స్వయంగా తనతో మమ్మల్ని సిద్దేశ్వరి ఆలయానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడవున్న ఆ రావిచెట్టును చూస్తూనే దానిని సమీపించి దాని ఆకులన్నింటినీ ప్రేమతో తాకాను. నాకు దర్శనం యిచ్చిన వృక్షం అదేనని తెలుసుకున్నాను.

ఆ తర్వాత అమ్మ తరచు ఆ కాళికాలయానికి వెళ్లి వస్తుండేవారు. ఒకరోజు అమ్మ భోలానాథ్ గారి చేత పెసరపప్పు, బంగాళాదుంపలు, బియ్యము, ఒక కొబ్బరికాయ తెప్పించి ఆ వస్తువులను తీసుకొని భోలానాథ్ గారితో కలిసి కొందరు భక్తులను వెంటబెట్టుకొని సిద్దేశ్వరిలోని కాళికాలయానికి వెళ్లారు. తీసుకువెళ్లిన పదార్థాలతో అక్కడ వంటచేసి కాళీమాతకు నైవేద్యం పెట్టిన తరువాత అందరూ ప్రసాదం స్వీకరించారు. ఆ రోజు నుండి కొన్నాళ్లపాటు భోలానాథ్ గారు, అమ్మ మరికొందరు భక్తులతో కలిసి అక్కడే బస చేశారు. అలా అక్కడ ఏడు రోజులు గడిచిపోయాయి ఎనిమిదవ రోజున వున్నట్లుండి అమ్మ భోలానాథ్ గారితో కలసి ఆలయం బయటకు నడిచి ఉత్తర దిశగా కొంతదూరం వెళ్లారు. అలా వెళ్తూ వెళ్తూ ఒక నిర్దుష్ట ప్రదేశం వద్ద ఆగిపోయారు అమ్మ. ఆ ప్రదేశంలో చతురస్రాకారంగా ఒక మట్టి దిబ్బ కనిపించింది. ఆ తర్వాత అమ్మ కొందరు భక్తులను ప్రతిరోజు ఆ ప్రదేశాన్ని భక్తితో దర్శించుకోవలసినదిగా ఆదేశించారు. అమ్మ ఆదేశంతో భక్తులు ఆ ప్రదేశాన్ని ఎంతో పవిత్రమైనదిగా గుర్తించి ప్రతిరోజు అలికి ముగ్గులు పెట్టి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించుకో సాగారు ఆ మట్టిదిబ్బ చుట్టూ పువ్వుల మొక్కలు తులసి మొక్కలు నాటి, చుట్టూ దడి కట్టించటం జరిగింది. ఆ మట్టి దిబ్బను ఇటుకరాళ్లతో చిన్న వేదిక వలె కూడా నిర్మాణం చేశారు. అమ్మ ఆదేశానుసారం కొంతకాలానికి భక్తులు ఆ ప్రదేశంలో భజనలు సంకీర్తనలు జరుపనారంభించారు.

సిద్దేశ్వరి లోని మట్టిదిబ్బ గురించి, దాని ప్రాధాన్యత గురించి చాలాకాలం వరకు అమ్మ ఎవరికి ఏమి చెప్పలేదు. కొన్నాళ్ల తర్వాత ఆమె భక్తులతో, "ఆ మట్టిదిబ్బ వున్న ప్రదేశంలో ఒకప్పుడు (బహుశా గత జన్మలలో కావచ్చు) శ్రీ భోలానాథ్ గారు సాధన చేశారు.

ఆయన అక్కడ దుర్గాదేవిని పూజించి ఆ దుర్గా ప్రతిమను కాళికా ఆలయం చెరువులో వదిలారు. ఐదువేల ఐదువందల సంవత్సరాలకు విభిన్న సాధకులు ఆ ప్రదేశానికి వస్తారు. పవిత్రమైన ఈ ప్రదేశం ఎంతో విశిష్టమైనది" అని చెప్పారు.

శ్రీ ఆనందమయి అమ్మ అప్పుడప్పుడు భక్తులతో కలిసి సిద్దేశ్వరికి వెళ్తుండేవారు. ఒకొక్కసారి రాత్రులు అక్కడే నిద్రించేవారు. కొన్ని సమయాలలో సమీపానవున్న రావిచెట్టు దగ్గరనున్న వేదిక వద్ద పూజాదికములు కూడా నిర్వర్తిస్తుండేవారు.

అమ్మ వసంతపూజా మహోత్సవాలు జరిపిస్తుండేవారు. ఒక సంవత్సరం ఎప్పటిలాగే ఎంతో వైభవంగా వసంతపూజలను జరపాలని అమ్మ సంకల్పించడంతో భక్తులంతా అందుకు తగిన సన్నాహాలు చేయనారంభించారు. ఉత్సవాలకు అమ్మ తల్లిదండ్రులు, బంధువులు, భోలానాథ్ గారి వైపు బంధువులు విచ్చేశారు. భక్తులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. శ్రీ ఆనందమయి అమ్మ ఆదేశానుసారం అమ్మ శరీర కొలతలతో వసంత మూర్తి విగ్రహం తయారుచేశారు. విక్రమపురం అనే ఊరి నుండి వచ్చిన పురోహితునిచే షష్టి, సప్తమి, అష్టమి తిథులలో చండీయాగంతో సహా నియమానుసారం పూజాదికములు నిర్వహించారు.

శ్రీ శ్రీ ఆనందమయి మాత ఆ సందర్భంగా చేయవలసిన వంటకాలను ఏమేమి చేయాలో తనే సూచించారు. అంతేకాదు, వంటకాలను ఒకేసారి వండాలని ఆదేశించారు. అలా చేయాలంటే వచ్చే భక్తుల సంఖ్య నిశ్చయంగా తెలియాలి కదా. అందువలన భక్తులు అమ్మకు తమ సందేహం విన్నవించుకొని ఎంతమందికి సరిపడా వండాలో తెలియజేయవలసినదిగా అమ్మను ప్రార్థించి ఆ కొలతలతో వంటలు చేశారు. ప్రతిరోజు సాయంత్రం వరకు వడ్డనలు జరుగుతూనే వున్నాయి. ఒకనాటి సాయంత్రం వచ్చిన భక్తులంతా భోజనాలు చేసిన తర్వాత వంట పాత్రలు కూడా పూర్తిగా ఖాళీ అయిపోయాయి. ఆ ఖాళీ వంట పాత్రలను శుభ్రం చేయడానికై బయట పడేశారు. చీకటిపడే వేళకు చాలామంది భక్తులు కొత్తవారు వచ్చారు. వంట చేసే వంటవారు కంగారుగా మరల వంట ప్రారంభించారు. భక్తులు ఈ విషయాన్ని అమ్మకు తెలియజేశారు. అమ్మ బయటపడవేసిన పాత్రలలో మిగిలివున్న పదార్థాలను వడ్డించవలసినదిగా ఆదేశిస్తూ మరల కొత్తగా వంటలు చేయవద్దని చెప్పడంతో భక్తులు పాత్రల అడుగున వున్న కొద్దికొద్ది పదార్థాలను ప్రోగుచేసి వడ్డించసాగారు. చిత్రంగా అవే వచ్చిన వారందరికీ సరిపోయి ఇంకా కొంత మిగిలిపోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

జ్యోతిష్ దాదా అనే వ్యక్తి అమ్మను తరచూ దర్శిస్తుండేవాడు. అతనికి అమ్మపై ఎనలేని భక్తి. అమ్మ దర్శనార్థం వచ్చినప్పుడల్లా అతడు భక్తుల మధ్య కూర్చొనక దూరంగా ఏదో ఒక మూలన అమ్మను చూస్తూ కూర్చునేవాడు. నిరంతరం అమ్మ స్మరణలోనే వుండేవాడు. అమ్మ చింతనలో అతడు ఎంతగా నిమగ్నమై గడిపేవాడంటే, తన ఇంట్లోనే కూర్చుని అతడు అమ్మను స్పష్టంగా దర్శించగలిగేవాడు. అమ్మ ఏ రోజున ఎలాంటి చీరెను ధరించారు అన్న విషయం కూడా వున్నది వున్నట్లుగా చెప్పేవాడు. అమ్మ యొక్క అపార కృపను పొందిన భాగ్యశాలి జ్యోతిష్ దాదా.

శ్రీ ఆనందమయి అమ్మ తనతో మాట్లాడటానికి వచ్చేవారి మనసులలోని భావాలను వెంటనే గ్రహించేవారు. ఆధ్యాత్మిక సాధనా విధానాలు, ఆధ్యాత్మిక స్థితులు వంటి ప్రసంగాలు చర్చకు వచ్చినప్పుడు అమ్మ వాటిని గురించి అతి సాధారణమైన, సులభమైన మాటలతో భక్తులకు తేలికగా అర్థమయ్యేటట్లు వివరించేవారు.

శ్రీ చైతన్య మహాప్రభు చరిత్రలో మనము కొన్ని విషయాలను గమనిస్తే వాటికి ప్రత్యేకించి వివరణ యివ్వటం చూస్తాము. అటువంటి వాటిల్లో ధర్మాచరణ చెప్పుకోదగినదిగా తోస్తుంది. ఆయన స్వయంగా తాను ధర్మాన్ని ఆచరించి ఆ తర్వాత దానిని యితరులకు బోధించేవారు. శ్రీ ఆనందమయి మాత కూడా ధర్మాచరణకు ఎంతో ప్రాధాన్యత నిస్తారు. జీవిత విధానాలలో ప్రతి ఒక్క అంశములో నిర్దేశింపబడిన ప్రతి ఒక్క ధర్మము తప్పనిసరిగా ఆచరించవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నదని అమ్మ చెప్పేవారు.

- సశేషం

# భక్తవత్సలుడు

(గత సంచిక తరువాయి)

శ్రీమతి మల్లాది సుబ్బలక్ష్మి

**(భగవదనుగ్రహం వల్ల లభించిన మాస్టరుగారి పరిచయాన్ని 'నిష్ఠ', 'సబూరి'లతో దిన దినాభివృద్ధి కావించుకొని సత్సంగాలు నిర్వహిస్తూ ఆ రోజుల్లో ఒంగోలు లాయరు పేటలో బాల భజన బృందం చేత భజనత్తయ్యగారిగా పిలవబడటమే కాక, మాస్టరుగారి చేత కూడా అత్తగారిగా పిలిపించుకున్న భాగ్యశాలి. జీవితంలో మాస్టరుగారి స్మరణను క్షణం కూడా ఏమారని ఈమె వారి అనన్య శరణాగతిలో పొందిన అనుభూతులను, అనుభవాలను, అందించు చున్నారు.)**

1985 జనవరిలో శనివారంనాడు మాస్టరుగారు మోహన రావుగారింటికి సత్సంగానికి వచ్చారు. వెళ్ళేటప్పుడు మావారు మాస్టరుగార్ని మోటారుసైకిల్ మీద ఇంటి దగ్గర దింపటానికి వెళ్ళారు. దారిలో మాస్టరుగారుండి "నాయనా ఇంటి సంగతేమనుకుంటున్నావ్" అన్నారుట. "నేనేమనుకోవటం లేదు సార్, స్థలం కోసం తెచ్చిన అప్పే ఇంకా తీరలేదు, ఇంక ఇల్లేమి కడతాను సార్" అన్నారుట. ఆయన ఇంటికొచ్చిన తర్వాత "మాస్టరుగారు ఇలా అడిగారే" అని అన్నారు. "మాస్టరుగారు అడిగారంటే అందులో ఏదో వుంటుంది దాని వెనకాల. కాబట్టి ఆయన అలా ఎందుకన్నారో నేను ఆదివారం మాట్లాడతాలెండి" అని అన్నాను. ఆదివారం వెళ్ళాను. మాస్టరుగారు "ఈ రోజు ఆదివారం కదమ్మా, రేపు సోమవారం మాట్లాడదాములే" అని అన్నారు. సోమవారం మళ్ళీ వెళ్తే "అమ్మా రేపు రథసప్తమి బాగుంది, శంకుస్థాపన చేస్తావా?" అన్నారు కాలెండర్ చూస్తూ. సోమవారం సాయంత్రం 6,7 గంటల వరకు అక్కడే వుండి మంగళవారం ప్రొద్దునే శంకుస్థాపన ఏం చేస్తాను? పైగా స్థలం కూడా ఎక్కడుందో తెలీదు. అందుకని "నాకు స్థలం కూడా తెలీదు సార్. ఎందుకంటే స్థలం యిచ్చిన వ్యక్తి నమ్మకస్తుడు కాబట్టి చూడకుండానే స్థలం కొనేశాం. అందువల్ల రేపు కుదరదు సార్" అని అన్నాను. మళ్ళా క్యాలెండర్ చూసి, "గురువారం బాగుందమ్మా, దశమి. ఆ రోజు చెయ్యి" అన్నారు. సరే రెండు రోజులు టైమ్ వుంది కదా! అందుకని చేస్తానని చెప్పి ఒప్పుకుని వచ్చాను. ఇంటికొచ్చిన తర్వాత ఈయన తిట్టారు. "ఎల్లుండి శంకుస్థాపనని గురువుగారు చెప్పారని శిష్యురాలు ఒప్పుకుని వచ్చింది" అని హేళనగా అని, "మన దగ్గర డబ్బుల్లేవు. స్థలం కోసం చేసిన అప్పు అలానే వుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా శంకుస్థాపన చేస్తారా? అని ఒకటే నస. నేను మాత్రం "ఏమన్నా గానీ మాస్టరుగారన్నారు కాబట్టి చేసి తీరాలి" అని అనుకున్నాను. మాకు వాస్తు తెలీదు. బ్రాహ్మణుడు లేడు. అప్పుడు ఈయన ఫ్రెండ్ మాస్టరుగారి భక్తులొకరు "మాస్టరుగారు చెప్పింది కాదనటం ఎందుకని చెప్పేసి, స్థలంలో ఈశాన్యం మూల శంకుస్థాపన చేయించేద్దాం. దాన్నిబట్టి ప్లాన్ ఎడ్జెస్ట్ చేసుకోవచ్చులే అని ఆయనకు తెలిసిన వాస్తు శాస్త్రజ్ఞుడు ఒకరు వుంటే ఆయన్ను తీస్కొచ్చి ఆయన చెప్పిన

చోట బాగుచేయించి అక్కడ గుంట త్రవ్వించాం. ఈయనకు తెలిసిన ఫ్రెండ్ కొంచెం సిమెంట్, కొంచెం ఇసుక, కొంచెం కంకర మూడు మూటలు కట్టి రిక్షాలో పంపించి "ముందు శంకుస్థాపన కానిచ్చేయండి" అని ఆయన ఇల్లు కట్టిస్తున్న బేల్దారు మేస్త్రీని కూడా పంపించారు. మాస్టరుగారొస్తారని తెలిసి ఓ...... జనం బోల్డంత మంది వచ్చారు. మరి మాస్టరుగారు కదా శంకుస్థాపన చెయ్యటం! అలా శంకుస్థాపన మాత్రం జరిగిపోయింది. మాదగ్గరా--- డబ్బులేవు. మొదలు పెట్టిన పని ఆగిపోయింది. లోన్ కి అప్లై చేశాం. ఎలాగైతేనేం అది సకాలంలో వచ్చింది.

స్లాబ్ లాగించేశాం. మా దగ్గర డబ్బు లేక ఇల్లు కట్టడం ఆపేశామని తెల్సి, "అయ్యో పనాగి పోయిందని వున్న డబ్బంతా ఎత్తుకెళ్ళి ఆ ఇంటికే పెట్టావు. వుండటానికి లేదు. అప్పు కట్టాలి. అప్పుకు వడ్డీ కట్టాలి" తెలిసిన వాళ్ళు, స్నేహితులూ తోచిన సహాయం చేసి ఆ యింటిని నిలబెట్టారు. ద్వారబంధం ఎత్తే టైంలో మాస్టరుగారొకసారి వచ్చారు. బేల్దారుండి, "అప్పుడధిక శ్రావణ మాసం సార్, మేం ద్వారబంధం ఎత్తకూడదు" అని ఈయనతో అంటే "మాక్కాదు చెప్పాల్సింది మాస్టరుగారికి చెప్పు" అన్నాను. అప్పుడు ఆయన వారి దగ్గర కెళ్ళి "మేం అధిక మాసంలో ద్వారబంధం ఎత్తం సార్" అన్నాడు. "మాకేం పట్టింపు లేదు. ఎత్తేసెయ్ అన్నారు. అట్లాగే ఇంకో రోజు మందిరంలో సత్సంగానికి వచ్చిన మాస్టరుగారు మా ఇంటికొచ్చారు. అప్పుడే బోరింగ్ వాళ్ళొస్తే చెప్పాను. "బోరింగ్ వెయ్యడానికి రేపు వస్తారంట సార్" అని మాస్టరుగార్తో అంటే "అయితే రేపు నేనొచ్చి కొబ్బరికాయ కొడ్తాను" అని అన్నారు. అంతకంటే ఆనందం మరోటి లేదు కదా మనకి. ఆయన వచ్చి యింట్లో కాలు పెడ్తే చాలు అని అందరూ అనుకుంటుంటే ఆయనంత ఆయనే వచ్చి కొబ్బరి కాయ కొడతానంటే అంతకంటే కావాల్సిందింకేమి వుంది? మా వారేమో "అక్కడ జనం అంతా మాస్టరుగారి కోసం కూర్చుని వెయిట్ చేస్తూ వుంటారు. వీళ్ళేంటా మాస్టరుగారిని తీసుకుపోతున్నారు మేం వచ్చి కూర్చుంటే అని వాళ్ళనుకుంటారు. పైగా మాస్టరుగారిక్కూడా శ్రమ కదా అంత దూరం నుంచి రావడానికి. నేను మాస్టరుగారిని తీసుకునిరాను" అన్నారు. "అయ్యయ్యో అలా అనకండి మహానుభావా! మాస్టరుగారే స్వయంగా వచ్చి కొబ్బరికాయ కొడ్తానన్నారు గనుక వెళ్ళి తీసుకొని రావాల్సిందే" అని నేను పట్టుబట్టాను. చివరకు ఆయనే వెళ్ళి మాస్టరుగార్ని తీసుకువచ్చారు. ఆయన చేతనే కొబ్బరికాయ కొట్టించి పంపించాము. చివరకు శ్లాబ్ వేసే రోజున కూడా నిచ్చెనెక్కి కొబ్బరికాయ కొట్టి కొంతమేర శ్లాబ్ వేసి ప్రారంభించారు.

ఆ విధంగా ఆయన దగ్గరుండి స్వయంగా అన్నీ చేసుకున్నారు. విక్రం వుండి "అత్తయ్యగారు మాకు మీ యిల్లు బాడుగకు ఇస్తారా? మేం వుంటాం కొత్తయిల్లు కదా. మీరుండకుండా మొదటిసారి మాకిస్తారా?" అన్నాడు. అప్పుడు నేనన్నాను "మొదటినుంచి మేమేమీ సొంత యింట్లో లేము. మాస్టరుగారు వచ్చి ఇంట్లో పాదం పెడితే చాలు అని అందరూ అనుకుంటుంటే, అలాంటిది ఆయనే మా ఇంట్లో వుంటానంటే నాకు అంతకంటే కావాల్సిందేముంది విక్రమ్? తప్పకుండా మీకే యిస్తాను" అని మాస్టరుగారికి యిచ్చేశాను. వారు 1986లో మా ఇంట్లో చేరారు. జనం వారికి ఊరికే యిచ్చాను అనుకునేవారు. కానీ ఆయన నా దరిద్రం తీర్చడానికి, ఆర్థిక ఇబ్బంది తీర్చడానికి నా ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అప్పుడక్కడ వున్న రెంట్ కంటే ఎక్కువే నాకు యిచ్చేవారు. అందరూ ఆశ్చర్యపోయారు అంత రేటిస్తుంటే. ఆ రెంట్ తోటి మెల్లగా అప్పు తీర్చుకున్నాం. అట్లా ఆ ఇల్లు ఆయన నిచ్చిన ప్రసాదమే.

మాకున్న యిద్దరు మొగపిల్లల విషయంలో కూడా ఆయన ఎంతో బాధ్యత తీసుకున్నారు. మాస్టరుగారు చెప్పిన ప్రకారం పిల్లలిద్దర్నీ చదివించాము. ఇవాల్టి రోజుల్లో మంచి జీతాలు తెచ్చుకుని వారి బ్రతుకు వారు బ్రతుకుతున్నారంటే, అది మాస్టరుగారి భిక్షే.

ఒకసారి చాలా పెద్ద పాము మా యింట్లోకొచ్చింది. సందు పక్కకెళ్ళడానికి దారిలేదు. మొత్తానికి ఎట్లానో లోపల కొచ్చేసింది. సందు పక్కనుంచి నావైపుకి వస్తోంది. బయటకెళ్ళడానికి నాకు దారి లేదు. వస్తే దాన్ని దాటుకుని రావాలి. పాముని చూస్తూనే 'బాబా!' అని కేకపెట్టేసరికి, నిజంగా బాబా దయే. ఇలా నావైపు వస్తున్నదల్లా పక్కకెళ్ళింది. పక్కకెళ్ళగానే నేను బయటకు వచ్చేసాను. అది మాత్రం

లోపలే వుండిపోయింది. ఇంతట్లో చుట్టుపక్కల వాళ్ళు సుబ్బలక్ష్మమ్మ గారింట్లోకి పామొచ్చిందని మాస్టరు గారికెళ్ళి చెప్పారు. మాస్టరుగారి దగ్గరకు ఆ రోజు చాలా మంది వచ్చి వున్నారు. మాస్టరుగారు వేదమ్మని, బుజ్జిగాడిని 'అత్తా' వాళ్ళింట్లో పామొచ్చిందట చూపిస్తా రమ్మని ఏదో ఒక ఆట వస్తువుని చూపిస్తున్నట్లుగా పిల్లల్ని తీసుకుని "సీతారామయ్యగారింట్లో పామొచ్చిందట వెళ్ళివస్తాన"ని అమ్మగారికి చెప్పి కండువా భుజాన వేసుకొని మాస్టరు గారు మా యింటికి వచ్చారు. ఆయన్తో పాటు అక్కడ వున్న భక్తులంతా వచ్చేశారు "ఎక్కడమ్మా పామంటూ". పామేమో సందులో కెళ్ళి పోయి అక్కడ పడుకున్నది. మాస్టరుగారు దానికి చాలా దగ్గరకెళ్ళి విభూతి చల్లారు. నాకేమో భయం అదెక్కడ గబుక్కున వచ్చి ఏంచేస్తోందో, ఏమోనని. మాస్టరుగారు విభూతి చల్లిన తర్వాత ఆ పాము మెదల్లేదు. అలా మన్ను తిన్న పాములాగా పడివుంది. చుట్టుప్రక్కల వాళ్ళందరూ కర్రలు తీసుకుని వచ్చారు పాముని చంపడానికి కానీ మాస్టరుగారు అందుకు ఒప్పుకోలేదు. ఆయనక్కడే కుర్చీలో కూర్చుని "కాఫీ తేమ్మా"అన్నారు. "నాకు వంటింట్లోకి వెళ్ళడానికి భయం సార్" అన్నాను... "నేనున్నాను కదా యిక్కడే. వెళ్ళి కాఫీ కలిపి పట్రా పో" అన్నారు. కాఫీ తాగుతూ ఆయన ఆనందంగా కూర్చున్నారు. ఆ తర్వాత ఎప్పటికో పాములను పట్టుకునేవారు వచ్చి, దానిని పట్టుకుని పోయారు. అప్పటివరకు మాస్టరుగారు దగ్గరుండి, ఆ తర్వాత వెళ్ళిపోయారు.

ఇంతలో మాకు నెల్లూరుకు ట్రాన్స్ఫర్ అయింది. జీతాలు సరిగ్గా రావటం లేదు. ఇల్లు కట్టుకున్న కొత్తలో ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా వుంది. వున్నట్లుండి మాస్టరుగారు "మీరు షిర్డీ వెళ్ళి ఒక వారం రోజులుండి.. రమ్మన్నారు. షిర్డీ వెళ్ళి వారంరోజులుండాలంటే మాటలా? ఎలా వెళ్ళాలా? అని అనుకున్నాం. కానీ మాస్టరుగారు చెప్పారు కదా! అని బయల్దేరి బుజ్జిగాణ్ణి కూడా మాతో పాటు తీసుకొని వెళ్ళాం. మేం ముగ్గురం షిర్డీలో వున్నప్పుడు అయోధ్యగారు (ఒక సాధకుడు, వాస్తు జాతకాలు బాగా తెలిసిన వారు). "మీకీ పీరియడ్ బాగుండలేదు. ఆక్సిడెంట్ అయ్యే సూచనలున్నాయి. అందుకే మాస్టరుగారు మిమ్మల్నిక్కడకు పంపించి వుంటారు. పెద్దాడి జాతకం ప్రకారం కూడా మీకు బాగాలేదు. కాబట్టి మీరు యింటికెళ్ళిన తర్వాత కూడా ఒక సం॥ము పాటు మోటార్ సైకిల్ వాడొద్దు" అని చెప్పారు. మాస్టరుగారు ఎందుకెళ్ళాలో కారణం చెప్పలేదు. చెప్పరు కూడా. వారం రోజులక్కడ వుండి తిరిగి ఒంగోలు వచ్చేశాం. సాయంకాలం 4 గంటల కొచ్చేశాం. ఆ మర్నాడు ప్రొద్దున్నే మాస్టరుగారింటికి వెళ్ళాం. వెళ్ళగానే బుజ్జిగాడు, వేదమ్మా అక్కడ ఓ ఫ్రెండ్ ఇంటికి తీస్కెళ్ళమన్నారు. ఈయనుండి "నేను తీస్కెళ్తాన్సార్" అని చెప్పారు. రెండు మూడు సార్లు వద్దన్నారు మాస్టరుగారు "నాయనా నువ్వొద్దులే, రాత్రే కదా ప్రయాణం చేసొచ్చారు, నువ్వు రెస్టు తీసుకో" అన్నారు. ఆయనెప్పుడూ ఏదీ డైరెక్టుగా చెప్పేవారు కాదు. ఆయన సూత్రప్రాయంగా చెప్తారు. అది మనం గ్రహించుకోవాలి. ఆయనదే చెప్పేవారు. "నన్నెప్పుడూ ప్రెస్ చేసి అడగద్దు. నా చేత బలవంతాన ఏదీ చెప్పించవద్దు" అని అంటూండేవారు. మనం ఏదన్నా చెయ్యమంటారా? వద్దంటారా? అని అడిగితే అప్పుడు కూడా చెప్పేవారు కాదు. కానీ ఇటువంటి విషయాలు అస్సలు చెప్పేవారు కాదు. "నువ్విప్పుడెళ్తే యాక్సిడెంట్ అవుతుంది. కాబట్టి వెళ్ళద్దు" అని చెప్పలేదు. మనకు ఏదో హింట్ ఇస్తున్నట్లుగా చెప్పేవారు. మనం మామూలు మానవులం కాబట్టి, ఆయన సూచనలని గ్రహించలేకపోతాము. "ఎవరో ఒకరు తీసికెళ్తారులే, నువ్వొద్దులే" అని కూడా చెప్పారు. కాదని చెప్పేసి ఈయన పిల్లల్ని తీస్కెళ్ళి వాళ్ళింట్లో దిగబెట్టారు. అంతే మోటర్ సైకిల్ని వెనక్కి తిప్పి బయలుదేరారో లేదో వెనకాల్నుంచి ఒక జీప్ వచ్చి మావారి బండిని గుద్దేసింది. మోటర్ సైకిల్ ఒక పక్క పడిపోయింది. అప్పుడు కాలేజీలో ఎలక్షన్ల గొడవలు. ఆ జీప్ ఎలక్షన్ కుర్రాళ్ళది. బండిని కొట్టేసి ఆ జీప్ వెళ్ళిపోయింది. జీప్ కొంచెం దూరం వెళ్ళాక జీప్ లోని కుర్రాళ్ళు. "ఒరేయ్ ఆయన మన సతీష్ నాన్నగారు. వాళ్ళైతే మనల్నేమీ అనరు" అని చెప్పి మళ్ళీ వెనక్కు వచ్చి ఆయన్ని జీప్ లో ఎక్కించుకొని యింటికి తీస్కొచ్చారు. ఇదంతా ఒక పదినిముషాలలో జరిగింది. "ఏమిటండి యిది" అని అడిగితే, "యాక్సిడెంట్ అయిందమ్మా, మోటార్ సైకిల్ అక్కడే వుంది. దాన్ని రిపేర్ చేయించి మేం తెచ్చిపెడ్తాం" అని చెప్పేసి వెళ్ళిపోయారు. వాళ్ళు ఆయన్ను

అలా వదిలేసి వెళ్ళిపోయి వుండవచ్చు కదా! అప్పుడు దిక్కు ఎవరు? మాస్టరుగారే మాయందుండబట్టి ఎంత జరగాల్సిందో, యింత చిన్న దెబ్బల్తో పోయింది. అక్కడ అయోధ్యగారు చెప్పారు. ఇక్కడ మాస్టరుగారు చెప్పారు. అయినా మనం వినకపోబట్టి గదా యిది జరిగింది. ఆయన మాట విని యింట్లో కూచుంటే ఆ టైం దాటి వుంటే, ఎట్లా జరిగి వుండేదో. అట్లా ఆయనకు జరగబోయేది తెలిసి సూచనలిచ్చేవారు. మనం గ్రహించుకోలేక బాధలు పడ్తుంటాము. అంతకంటే యింకేమీ లేదు.

మాస్టరుగారు సమాధి అవటానికి 9 రోజుల ముందు, మాస్టరుగారింటికి వెళ్తే ఆయన "అమ్మా షిర్డీ నుంచి ధుని వచ్చింది. మాయీ అమ్మ, రామిరెడ్డి తాతగారు మొదలైన మహాత్ములు వచ్చారిక్కడికి. అందుకని ఈ రెండు రూములని చాలా పవిత్రంగా వుంచు" అన్నారు. అప్పుడు నేననుకున్నాను, "మాస్టరుగారికి స్థలం కొని వున్నాం. ఎటుతిరిగి బిల్డింగ్ కట్టించి యివ్వాలన్న ప్రపోజల్ వుంది మాస్టరిగారి భక్తులకు. ఇల్లు కట్టిచ్చి యిచ్చాక మాస్టరు గారక్కడికి వెళ్తారు. అప్పుడు నేనేమన్నా ఈ యింటిని అపవిత్రం చేస్తావేమోనన్న వుద్దేశ్యంతో ముందుగా చెప్తున్నారేమోననుకున్నాను. అప్పటికి ఆరోగ్యంగా వున్నారు. నిండా యాభై ఏళ్ళు లేవు. అందువల్ల ఇంకోరకమైన ఆలోచన ఎలా వస్తుంది! అప్పుడు నేను "అలాగే సార్, మాకు ట్రాన్స్ఫర్స్ వుంటాయి గదా! ఒకవేళ మాకు ట్రాన్స్ఫర్ అయితే మిగతా రూములు బాడుక్కిచ్చినా, ఈ రెండు రూములు మటుక్కు మాకిందనే వుంచుకుని తాళం వేసుకుంటాను సార్. నా చేతనైనంతవరకు అపవిత్రం కాకుండా చూస్తాను సార్" అన్నాను.

సరిగ్గా తొమ్మిది రోజుల తర్వాత చాలా అనూహ్యంగా, అకస్మాత్తుగా మాస్టరుగారు సమాధి చెందారు. బాబా బూటీని అడిగి మరీ సమాధి మందిరాన్ని కట్టించుకున్నట్లు మాస్టరుగారు 'ఇంటి సంగతేమనుకుంటున్నావ్' అని అడిగి ఆ యింటికి శంఖుస్థాపన చేసి అడుగడుగునా తన పర్యవేక్షణలో, తన స్పర్శతో, పవిత్రంగా కట్టించుకుని, ఆ తర్వాత దానికి ద్వారకామాయి అని పేరు పెట్టి, తానే అందులో ప్రవేశించి తన వునికితోటి, ఎందరో మహాత్ముల పాద స్పర్శతోను పవిత్రీకరించి, చివరకు తన శరీరాన్ని అక్కడ వదిలేశారు. అటువంటి పవిత్రమూర్తి నివసించిన ఆ నిలయం మాకు నిజంగా 'ద్వారకామాయి'యే! వారు సంచరించి సమాధి అయిన ఆ పుణ్యస్థలం మాకు పుణ్యక్షేత్రం! ●

---

## మాతృదేవి స్మృతులు

09వ పేజీ తరువాయి

అందరికీ చెప్పుకుంటూ వెళుతోంది. కొంతసేపటికి పూజ్యశ్రీ అమ్మగారు మా ఇంటికి వచ్చారు. మేమందరం పూజ్యశ్రీ అమ్మగారికి పాదపూజ చేసుకోవాలని అనుకున్నాము. దానికి సంబంధించినవి అన్నీ సమకూర్చుకోవడంలో అరగంట ఆలస్యమయింది. "మీరెప్పుడూ ఇంతేనర్రా, ఆలస్యం చేస్తారు!" అన్నారు పూజ్యశ్రీ అమ్మగారు. మేమందరం అనుకున్నట్లుగానే, అమ్మకి పాదపూజ చేసుకున్నాము. పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్నందరిని ఆశీర్వదించారు. అంతటితో నా స్వప్నం ముగిసింది.

అప్పటికే మా ఇంట్లో అందరికీ జ్వరాలు వున్నాయి. మూడవరోజు కరోనా పరీక్షా చేయిస్తే ఏడుగురికి కరోనా వచ్చిందని తేలింది. వృద్ధులకు, పసిబిడ్డలకు కూడా సోకడంతో భయభ్రాంతులకు గురయ్యాము. కానీ అప్పటి మా పరిస్థితులకు మేము ఏ ఆసుపత్రికీ వెళ్ళలేకపోయాము. మేమందరమూ హెల్త్ డిపార్ట్మెంట్ వారిచ్చిన మందులు మాత్రమే వాడుతూ ఇంట్లోనే వున్నాము. ఆ సామాన్యమైన మందులతోనే ఏ ప్రమాదానికీ ఎవ్వరమూ గురికాకుండా వారం రోజులలోనే కరోనా నుండి కోలుకోవడం జరిగింది!

మాకు జరగబోయే ప్రమాదాన్ని ముందే వారించి, వారి దివ్యదర్శనాన్ని అనుగ్రహించి, పాదపూజ స్వీకరించి, మమ్మల్ని ఆశీర్వదించి, ఆ భయంకర విపత్తునుండి మమ్ము కాపాడిన పూజ్యశ్రీ అమ్మగారి పాదపద్మములకు శతకోటి వందనములు. పూజ్యశ్రీ అమ్మగారు విశ్వచైతన్య స్వరూపిణి, సర్వజ్ఞులు, సర్వసమర్థులు అనడానికి ఈ లీల ప్రత్యక్ష తార్కాణం. వారి అనుగ్రహ ఆశీస్సులు మా అందరిపై ఎల్లవేళలా వుండాలని ప్రార్థిస్తున్నాను.

*ఓం రోగనివారిణ్యై నమః!*

***-శ్రీమతి కనకదుర్గ***

# మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## దామోదర్ ఘనశ్యామ్ బాబ్ రే

బాబాను ఓరిమి - విశ్వాసాలతో సేవించిన వారిలో దామోదర్ ఘనశ్యామ్ బాబ్ రే ఒకడు. ఇతడు రాణే జిల్లాలోని చించనీ అనే గ్రామానికి చెందినవాడు. కనుక యితనిని అందరూ 'అన్నాచించణీకర్' అనేవారు. ఇతడు, యితని భార్య లక్ష్మీబాయి చాలా సం॥లు శిరిడీలో వుండి బాబాను హృదయపూర్వకంగా సేవించారు. ఈ దంపతులకు చాలాకాలం సంతతి కలుగలేదు. ఒకసారి యీ దంపతులు బాబాకు సేవ చేస్తుండగా శ్యామా, కాకా దీక్షిత్ లు గూడా మశీదులో వున్నారు. బాబాతో శ్యామా, "దేవా! ఏమిటి మీ లీల? భక్తులు తమ కోరికలు నెరవేర్చుకోడానికి ఎంతో దూరం నుండి మీవద్దకు వస్తుంటే వారందరి కోరికలూ తీరుస్తున్నారు. కాని ఈ అన్నా, లక్ష్మీబాయి మిమ్మల్ని యింతకాలంగా సేవిస్తున్నా మీరు వీళ్ళకు సంతానం ప్రసాదించరేమిటి?" అన్నాడు. బాబా చిన్నగా నవ్వి, "శ్యామా, నీవు చిన్నవాడివి, నీకేమీ తెలియదు. ఎవరైనా మనస్ఫూర్తిగా యేదైనా కోరితే నేను ప్రసాదించకపోవడం ఎప్పుడైనా జరిగిందా? ఈ దంపతులు నన్నేమీ కోరలేదు. కావాలంటే వారినే అడుగు. వారికి నిజంగా బిడ్డ కావాలా? కావాలంటే యిస్తాను. కాని ఎలాగైనా యితని వంశం మాత్రం ఒక్క తరం మాత్రమే కొనసాగుతుంది కనుక యితని పేరు చిరస్మరణీయం చేయాలనుకున్నాను" అన్నారు.

బాబా మాటల కర్థమేమో ఎవరికీ అప్పుడు తెలియలేదు. అన్నాచించణీకర్ వయస్సు 50సం॥లు దాటింది. ఆ కాలంలో అతనికి కొన్ని పొలాలకు సంబంధించిన వ్యాజ్యమొకటి దహనూ కోర్టులో నడుస్తున్నది. అప్పుడప్పుడు బాబాను అతడు దానిగురించే అడుగుతుండేవాడు. కాని అతడెప్పుడడిగినా బాబా "అల్లాహ్ అచ్ఛా కరేగా" అని మాత్రమే సమాధాన మిచ్చేవారు. ఇలా 3 సం॥లు గడచిపోయాయి. అన్నా తరపున యీ కేసులో అచ్యుత్ నారాయణ్ కేర్ అనే న్యాయవాది కోర్టులో వాదిస్తున్నాడు. ఒకసారి ఆ కేసు నడుస్తుండగా అన్నాచించణీకర్ ను వేధించడానికి అతడి కేసు ఓడిపోయిందని గిట్టనివారెవరో అతనికి తెల్పారు. ఆ జాబు చూడగానే అతను కాకా దీక్షిత్ వద్దకు వెళ్ళాడు. ఆ యిద్దరూ పట్టరాని బాధతో ఆ విషయం బాబాను అడగాలని వెళ్ళారు. వాళ్ళు ఆ మశీదులో ప్రవేశిస్తుండగానే బాబా వారి కేసి చూచి, "ఈ ముసలాడికి నామీద నమ్మకంలేదు. ఆ ఉత్తరం చింపి అవతల పారేయండి!" అన్నారు. కొద్ది నెలల తర్వాత అతడు కేసు నెగ్గినట్లు, అతనికి ₹1800/-లు, కోర్టు ఖర్చులూ చెల్లించాలని కోర్టులో డిక్రీ అయినట్లూ తన లాయర్ వద్దనుండి చించణీకర్ కు జాబు వచ్చింది. వెంటనే అతడు కాకాదీక్షిత్ కు తెల్పి అతనిని తీసుకొని మశీదుకు వచ్చాడు. అతడేమీ మాట్లాడకముందే బాబా అతనిని చూస్తూనే, "నీ కిప్పటికైనా విశ్వాసం కుదిరిందా!" అన్నారు. అప్పుడు చించణీకర్ ఆ జాబు బాబా పాదాలవద్ద వుంచి, "బాబా, యిదంతా మీదే. నాకేమీ వద్దు" అన్నాడు. బాబా, "ఈ ధనం నేనేమి చేసుకుంటాను? నాకేమైనా పెద్ద కుటుంబమున్నదా ఏమి? మీరే తీసుకోండి" అన్నారు. దాని విషయమై కొంతసేపు మాట్లాడుకున్నాక, ఆ డబ్బుతో రోజు విడిచి రోజు బాబా నిద్రించే చావడికి మరమ్మత్తులు చేసి పునరుద్ధరించవచ్చని కాకా దీక్షిత్ సూచించాడు. తర్వాత అన్నా చించణీకర్ అలానే చేసాడు.

చివరకు ఈ చించణీకర్ దంపతులు తమ యావదాస్తినీ శిరిడీ సాయి సంస్థానానికి - వీలునామా ద్వారా ధారాదత్తం చేసారు. అంతేగాక, బూటీ నిర్మించిన సమాధి మందిరానికి ఎదుట సభామండపం నిర్మించడానికి ఖర్చయిన

₹55,000/-లలో ఎక్కువ భాగం 'అన్నాచించణీకర్ ట్రస్ట్' మరియు 'రస్నే ట్రస్ట్' లే చెల్లించాయి.

ఈ చావడిలో డిశెంబరు 10, 1909 నుండి భక్తులు బాబాను శాస్త్రోక్తంగా పూజించడము, ఆయనకు ఆరతివ్వడమూ ప్రారంభించారు.

## సంభారే

విల్లేపార్లేకు చెందిన సంభారే బాబా గురించిన తన స్మృతులిలా వ్రాశాడు:

''బాబా చిలిం త్రాగుతూ తమ దగ్గరున్న వారికి గూడ యిస్తుండేవారు. నాకు బీడీ త్రాగే అలవాటున్నది. ఒకసారి వారందరినుండి దూరంగా కూర్చున్న నాకు గూడ చిలిం త్రాగాలనిపించింది. వెంటనే బాబా, "ఎందుకంత దూరంగా కూర్చున్నావ్? దగ్గరకు రా, పొగత్రాగు" అని నన్ను పిలిచి, చిలిం యిచ్చారు. నేనుగూడ పొగ త్రాగాను. ఆయన నా కోరిక తెలుసుకొని దయతో చిలిం ప్రసాదించినందుకు సంతోషించాను. నాకు త్రాగుడు అలవాటుండేది. ఫిబ్రవరి1, 1917న బాబా నాకు కలలో కనిపించి, "అబ్బాయ్, నీవేం చేస్తున్నావ్?" అని మందలించారు. నేను త్రాగుడు మానుకుంటానని మాట యిచ్చి, మరురోజు నుంచే మానేశాను.

బాబా మహాసమాధికి కొద్ది ముందు మేము వారి దగ్గర సెలవు కోరినపుడు రానున్న ఘట్టాన్ని సూచించేలా బాబా, "మీరు బొంబాయినుండి వస్తున్నారు. నా మాటలు మీరు, మీ విన్నపాలు నేనుగూడ ఎల్లకాలం వింటూనే వుండాలి. సరే, మీరు వెళ్ళండి. రేపు మధ్యాహ్నానికి మీరు యిల్లు చేరుతారు!" అన్నారు. మేము రాత్రి కోపర్గామ్ మీదుగా వెళ్ళి మరుసటి ఉదయం 8 గం॥లకు యిల్లు చేరాలను కున్నాము. మా రైలుకు యింజను చెడిపోయి, రైలు 4 గం॥లు ఆలస్యమైంది. మేము బొంబాయి చేరేసరికి ఖచ్చితంగా 12 గం॥లు అయింది. బాబా చెప్పిందే జరిగింది. కొద్దిరోజులలో బాబా మాకు సెలవివ్వడానికి ఎందుకు తటపటాయించారో మాకపుడు అర్థమయింది.

సుమారు 14 సం॥లు ముందు ఒకరోజు బాబా నాకు కలలో కనిపించి, "అబ్బాయి, నేను నీ గురువునని చెప్పుకుంటున్నావు. నేను నీకేమైనా ఉపదేశ మిచ్చానా?" అన్నారు. అప్పుడు నన్ను చేతులు కడుక్కోమని చెప్పి, ఒక మరాఠీ శ్లోకం చెప్పి, దానిని జపించమన్నారు. అదే నాకు ఉపదేశం. నేను కలలో దానిని చక్కగా వల్లించాను గాని, మెలుకువ వచ్చేసరికి ఆ శ్లోకం గుర్తులేదు.

నాకు 55 సం॥లు నిండగానే మా కంపెనీ నిబంధనలు ప్రకారం నేను ఉద్యోగం విరమించాలి. నాకు అప్పుడు ఒక కల వచ్చింది; మా కంపెనీ డైరెక్టరుగారు కలలో కొచ్చి నేను ఉద్యోగ విరమణ గూర్చి ఆలోచించ నక్కరలేదన్నాడు. ఎన్నడూ నన్నెవరూ వుద్యోగ విరమణ చేయమని చెప్పనేలేదు. నాకెంతో బరువైన బాధ్యతలున్నాయి. నా వ్యవహారాలన్నీ బాబాగారే చూచుకొంటున్నారు. నేను దేనికోసమూ ప్రార్థించను. నాకేది అవసరమో బాబాకు తెలుసు. నాకు అవసరమైనది ప్రసాదించడం వారి వంతు. వారి సంకల్పానుసారం మనకు తగినది వారిని చేయనివ్వడం మనకు సంతోషము."

## పార్శీ మతస్తుడు

బొంబాయిలో ఒక ఆఫీసులో పనిచేసిన ఒక గుమస్తా, పార్శీమతస్థుడు, యిలా వ్రాశాడు: "మా అన్నగారికి పిచ్చెక్కి వైద్యులుగూడ నయంచేయలేక పోయారు. అది సాయిబాబా అనుగ్రహంతో తగ్గిపోతుందని ఎవరో చెప్పడంతో అతనిని తీసుకుని 1913లో మొదటిసారి శిరిడీ వచ్చాను. తర్వాత అతనిని శిరిడీలోనే అమీదాస్ మెహతా అను భక్తుని వద్దవుంచి, నెలకు ₹30/-లు పంపించాను. కొద్దిమాసాలపాటు బాబా ఆరతులకు హాజరై, వారి ఆశీర్వాదం, ఉదీ, తీర్థం తీసుకొనడంతో ఏ మందులూ వేయకుండానే అతనివ్యాధి తగ్గడం ఆశ్చర్యం.. నా 12వ సం॥లో నేను రోజూ బాబా పటానికి నమస్కరించుకునేవాణ్ణి. ఆయన తరచుగా నాకు స్వప్నంలో దర్శనమిస్తుండేవారు. ఆయన ఎప్పుడు కన్పించినా నాకు రానున్నకష్టమేదో ఆయన తొలిగించినట్లు తర్వాత తెలుస్తుండేది. బాబాతో నాకుగల అనుభవాలు ఎంతో మధురమైనవి. వారి సన్నిధికి వెళ్ళగానే అన్ని సమస్యలు మర్చిపోయేవాణ్ణి. ఎట్టి బాధా, ఆందోళన, చింత, భయమూవుండేవి కావు. నామనసునుండి అన్నీ తుడిచి పెట్టుకొనిపోయి, వారి సన్నిధిలో ఆనందంగా గడిచిపోయేది. అది అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం. ఇప్పటికి గూడ ఆయన కలలోకొస్తే అట్టి అనుభవమే కల్గుతుంది. ఆయనెంతో దయామయుడు. ఆయనకు సర్వమూ తెలుసు.

వారిని దర్శించేనాటికి 1913లో నేనెంతో పేదవాణ్ణి; కేవలం నెలకు ₹.60/-ల జీతంపై పనిచేస్తుండేవాణ్ణి. ఆయన నన్ను గూడ దక్షిణ కోరుతుండేవారు. అప్పుడప్పుడు ఆయన నా జేబులోవున్నదంతా తీసివేసుకునేవారు. ఒకసారి నా వద్ద ₹.8/- లు మాత్రమే వుంటే ఆయన దక్షిణగా అంతా తీసివేసుకున్నారు. నాదగ్గరున్న చివరి పైసావరకూ ఆయన తీసివేసుకున్నాక నాకేమీ బాధలేదని విన్నవించాను. అటుతర్వాత ఆయన నన్ను దక్షిణ అడగడం మానివేశారు. నావద్ద నున్నదంతా ఆయన కిచ్చివేయడంవలన నాకెన్నడూ ఎట్టి బాధా కల్గలేదు. మనకు ప్రసాదించడం ద్వారానేగాక, మననుండి తీసుకొనడంద్వారా గూడ వారు మనలననుగ్రహిస్తారు.

## రాజబల్లీ మహమ్మద్

బాంద్రాకు చెందిన రాజబల్లీ మహమ్మద్ యిలా వ్రాశాడు; "నేను నాసిక్ లో పనిచేస్తుండగా ఒకసారి నా వృత్తికి సంబంధించిన సరకు రావడమాలస్యమైతే ఆ సమయంలో నేను సాయిని దర్శించి, ఆయనకు ఒక కొబ్బరికాయ, కలకండ సమర్పించాను. ఆయన నన్ను దక్షిణ అడుగనూలేదు, నేను సమర్పించనూలేదు. నేను ఆ మరుసటి ఉదయమో, లేక అటుతర్వాత ఉదయమో తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాను. అపుడు బాబా, 'అతడిప్పుడే నీ సరుకు అందించడానికి సిద్ధంగా లేడు' అన్నారు. నాసిక్ లో సమయం వృధాపరచడమిష్టం లేక, నేను మరో మూడు రోజులు బాబా సన్నిధిలోనే వున్నాను. నాకు కావలసింది తీవ్రమైన భక్తి. నా చివరి శ్వాస సంపూర్ణమైన విశ్వాసంతో విడచి సద్గతి పొందడమే. నేను మనసులో వారినదే కోరుకున్నాను. ఆయన నా తలపై చేయిపెట్టి ఆశీర్వదించారు. ఆ క్షణం నుండే వారి ఆశీర్వచనం ఫలించసాగింది. నా భక్తి స్థిరంగా వృద్ధి చెందుతోంది. వారి పైన, ఊదీ పైన నాకు గల విశ్వాసం నా కెంతో మేలుచేసింది....సాయి నిస్సందేహంగా ఎంతో శక్తిమంతులైన మహాత్ములు.

ఇస్లాం ప్రకారం మహాత్ములు చనిపోరు; ఒక స్థితినుండి మరొక స్థితికి వెడతారు. నేను నాగపూర్ కు చెందిన తాజుద్దీన్ బాబా, పూణేకు చెందిన బాబాజాన్ వంటి సజీవులైన మహాత్ము లెందరినో దర్శించాను. నాకెన్నో అనుభవాలు కలిగాయి. 'మనకై మనము వందసార్లు ప్రార్థించడంకంటే మహాత్ముల సన్నిధికి ఒక్కసారి వెళ్ళడం మేలు' అన్న లోకోక్తిని నేను దృఢంగా నమ్మి ఆచరిస్తున్నాను".

## బోడస్

ప్రఖ్యాత మహారాష్ట్ర నటుడు గణపతిరావ్ బోడస్ మొదట నాస్తికుడే. సాధువులచుట్టూ తిరిగేవారిని గేలిచేస్తుండేవాడు. అతడు సాయిని దర్శిస్తే అతడి అభిప్రాయం మారగలదని మిత్రులు చెప్పారు. అతడు ఆఫీసు పనిమీద అహ్మద్ నగర్ వచ్చినప్పుడు శిరిడీ వచ్చాడు. అక్కడకు రాగానే యేమనుకున్నాడోగాని ఒక కొబ్బరికాయ, కొద్ది పొగాకు కొని సాయిని దర్శించి సమర్పించుకున్నాడు. ఆ పొగాకుతో అతడినే చిలిం సిద్ధం చేయమని చెప్పి బాబా అతనిని దక్షిణకోరారు. అతడొక రూపాయి సమర్పించి, వారి వర్చస్సుకు చకితుడై ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. బాబా, "నీవు మధ్యాహ్నం భోజనంచేసి వెళ్ళు" అని ప్రేమగా చెప్పి, మరుక్షణమే ఆయన ఉగ్రులై, "వెధవల్లారా, మీరిలా పోట్లాడుకుచస్తే బాబా మీకేమి చేస్తాడు?" అన్నారు. అంతకు రెండు రోజులముందు సాటి ఉద్యోగియైన జోగ్లేకర్ తో తాను పోట్లాడినందుకు బాబా అలా అన్నారని తెలిసి బోడస్ ఆశ్చర్యపోయాడు. తర్వాత అతడు భోజనానికి వెళ్ళినపుడు ఒక భక్తుడు, సాయి దక్షిణ కోరినపుడు మనవద్దనున్నదంతా సమర్పించడం ఎంతో అదృష్టమని చెప్పాడు. మరల శిరిడీ వచ్చినప్పుడు అలానే చేద్దామనుకున్నాడు బోడస్, అతడు బాబావద్ద సెలవు తీసుకోడానికి వెళ్ళినపుడు ఆయన 'బాలనాయీ' అనే మంగలిచేత క్షురకర్మ చేయించుకుంటున్నారు. అతనిని చూస్తూనే, "వెళుతున్నావా?" అన్నారు. "లేదు, మీ అనుమతి కోరడానికి వచ్చాను" అన్నాడు బోడస్. అతడెంత సూక్ష్మ బుద్ధి! వెంటనే సాయి అతనిని దక్షిణ కోరారు. అతడు సంతోషంగా తన వద్దనున్నదంతా సమర్పించాడు. బాబా అతని నుదుట ఊదీ పెట్టి, అతని తలమీద చేయి పెట్టి, "నీవు హృదయపూర్వకంగా నీవద్దనున్నదంతా యిచ్చావు గనుక భగవంతుడు నీకు సర్వమూ సమృద్ధిగా ప్రసాదిస్తాడు" అని ఆశీర్వదించారు. సాయిని దర్శించాక యింకే మహాత్ముణ్ణి దర్శించ నక్కరలేదని బోడస్ నిశ్చయించుకున్నాడు. కొద్దికాలంలో అతడెంతో సంపన్నుడయ్యాడు.

- సశేషం

# మాతృదేవి దివ్య సన్నిధిలో దత్త జయంతి వేడుకలు!!

శ్రీమతి టి. పద్మావతి

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి దివ్య సన్నిధానములో 2022 డిసెంబర్ 7 వ తేదీన దత్త జయంతి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. తెల్లవారుతూనే పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి మేలుకొలుపు, అనంతరం సమర్ధసద్గురువు సాయినాథునికి కాకడ ఆరతి జరిగాయి. మాతృదేవి సమాధికి ముందుభాగంలో, ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై దత్త పాదుకలకు 11 మంది వేదపండితులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రమంత్ర పఠనం చేయగా, గురు పుత్రులు శ్రీ ద్వారకానాథ్ గారు అభిషేకం చేశారు. అదే సమయంలో, పూజ్యశ్రీ అమ్మగారికి భక్తులందరూ కలిసి అభిషేకం చేశారు. మంగళకరమైన రుద్రగాన ఘోషతో, భక్తులందరి హృదయాలతో పాటు ప్రకృతి కూడా పరవశించింది. అభిషేకానంతరం పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేస్తుండగా, గురుపుత్రులు శ్రీ ద్వారకానాథ్ గారు దత్తజయంతి ప్రాశస్త్యాన్ని గురించి వివరించారు.



అందులో భాగంగా, అత్రి అనసూయల పుత్రుడైన దత్తాత్రేయస్వామి జననం, అనసూయమాత పాతివ్రత్యం వివరించారు. త్రిమూర్తుల భార్యలకు అసూయరావడం గురించి, దాని వెనుకవుండే భావం గురించి అత్యంత హృద్యంగా వివరించారు. నిన్న-రేపు-నేడు, నిద్ర-మెలకువ-స్వప్నం ఈ మూడింటిని గెలవడం 'అత్రి'. కావాలి అనే కోరిక లేకపోవడం 'అనసూయ'. మన మనస్సు, శరీరము, ప్రాణ చలనము నిశ్చలమైనప్పుడు ఆనందం అనుభవమౌతుంది. అదే దత్తజయంతి. అటువంటి దత్తజయంతిని మనకి ప్రసాదించేవారే మన గురుదేవులు అంటూ ఎన్నో అమూల్యమైన విషయాలని తెలియచేసారు శ్రీ బాబుగారు. తదనంతరం ప్రత్యేకంగా అలంకరించిన దత్తాత్రేయ స్వామికి షోడశోపచార పూజ చేసారు. మధ్యాహ్న సమయం అవ్వడంతో, శిరిడీ సాయిబాబాకి ఆరతి, తరవాత మహానివేదన జరిగింది. భక్తులందరూ ఒకొక్కరుగా దత్తస్వరూపులైన పూజ్యశ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్లకి నమస్కరించుకున్నారు.

ముందుగా సూచించినట్లు సాయంత్రం కార్యక్రమాలు కొనసాగాయి. ఈవిధంగా దత్తజయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.

దత్త జయంతి కార్యక్రమాలను ఈ కింద ఇవ్వబడిన యూట్యూబ్ లింక్ ద్వారా భక్తులు వీక్షించవచ్చు. https://bit.ly/3PyXUFL

(గత సంచిక తరువాయి)

# మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు

*శ్రీమతి శ్రీదేవి*

గ్రామంలోని స్త్రీలందరికీ సద్గురువై ఆధ్యాత్మికంగా నడిపించిన పులిపాక శేషమ్మగారు మహాలక్ష్మి భక్తురాలు. ఈమెకు శ్రీమహాలక్ష్మిదేవి నిత్యసాక్షాత్కారం వుండేది. ఆ దేవి ఈమె భక్తికి మెచ్చి ప్రతిరోజు ఈమెకు పులిహోర, పొంగలి, పాయసం, వడలు ఇలా ఏదో ఒక ప్రసాదం అనుగ్రహించి అదృశ్యమయ్యేది. ఆ ప్రసాదాన్ని ఆమె తన వద్దకు వచ్చే భక్తులకు పంచేవారు. (శ్రీ అలివేలు మంగమ్మ మాతృమూర్తి శ్రీమతి రంగనాయకమ్మగారు. వారి నాయనమ్మగారే ఈ పులిపాక శేషమ్మగారు. శ్రీ రంగనాయకమ్మ గారి అక్కగారు అయిన మన్నవ సత్యవతిదేవి కూడా శ్రీ మహాలక్ష్మి సాక్షాత్కారం పొందిన గొప్ప లక్ష్మి భక్తురాలు.) జ్ఞానయోగి మన్నవ క్రిష్ణయ్యగారు, యోగిని శ్రీమతి మరిదమ్మ గారు, జిల్లెళ్ళమూడి అమ్మ, దివ్యజనని అలివేలు మంగమ్మ – వీరంతా కాక ఇంకా ఎందరో మహాత్ములు మన్నవ గ్రామంలో ముద్దుబిడ్డలుగా జన్మించారు.

ఒకసారి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారు మన్నవ గ్రామానికి విచ్చేశారు ఆశ్చర్యమేమంటే ఏ ఊరిలోనైనా ఒక్క రోజు కంటే వుండని శ్రీ కోటయ్య శాస్త్రిగారు తనకై తానే ఈ గ్రామంలో కొన్ని రోజులు వుండిపోయారు. అలా తమకై తామే ఎంతో ఇష్టంగా మన్నవ గ్రామంలో వుండిపోయినందుకు గ్రామ ప్రజలంతా ఎంతగానో పొంగిపోయారు. 'అంతటి మహాత్ముడు ఎప్పటికీ తమ గ్రామంలోని వుండిపోతే ఎంత బాగుంటుంది!' అని ఆశించిన గ్రామ ప్రజలు తమ కోరిక వారికి విన్నవించుకున్నారు. తమ ఊరిలోనే కుటుంబంతో స్థిరపడవలసిందని, వారికి నివాస గృహము జీవనభృతి కూడా సమకూర్చగలమని, దయతో తమ విన్నపమును మన్నించమని కోటయ్య శాస్త్రిగారిని వారు వేడుకొన్నారు. శాస్త్రిగారు అంగీకరించి కుటుంబ సమేతంగా మన్నవ గ్రామంలో స్థిరపడ్డారు.

శ్రీ కోటయ్య శాస్త్రిగారు ఏకాదశి వ్రతం చేసేవారు. ప్రతి ఏకాదశి నాడు ఉపవాసం ఉండి ద్వాదశి నాటి పారణకు ఊరివారిందరికీ తన ఇంటిలోనే వంటలు చేయించి సంతర్పణ చేసేవారు. ద్వాదశి సంతర్పణ కోసం నాలుగైదు రోజులు ముందుగానే గ్రామ పెద్దలు గ్రామంలోని వారందరి ఇండ్ల నుండి బియ్యము, పప్పులు, ఆహార దినుసులు అన్నింటిని సేకరించి శాస్త్రిగారి ఇంటికి చేర్చేవారు. ఊరిలోని ధనవంతులు బస్తాలకొద్దీ ధాన్యాలు, వస్తువులు సమర్పించేవారు. పేదవారు కొద్దిగా మాత్రమే యిచ్చేవారు. ఏకాదశి రోజు సాయంత్రం శ్రీ శాస్త్రిగారు ఊరివారిని ఆహ్వానించడానికి బయలుదేరేవారు. ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి ఆహ్వానించేవారు. అలా ఆహ్వానించే సమయంలో ఎవరు ఎక్కువ సంభారాలు పంపారు, ఎవరు తక్కువ పంపారు అన్న విచక్షణ, వివక్ష చూపేవారుకాదు. ఇంటిలోని వారికి చేతులు జోడించి నమస్కరిస్తూ, "అమ్మా! ద్వాదశి పారణ సందర్భంగా మా ఇంట్లో జరిగే సంతర్పణకు దయతో మీరందరూ రండి. తల్లులు, బిడ్డలు, పిల్లలు, పెద్దలు, ఆడవారు, మగవారు, వృద్ధులు ఇంటిలోని ప్రతి ఒక్కరూ దయచేయండి. నా సేవ స్వీకరించి, భగవత్ప్రసాదం స్వీకరించి ఆయన అనుగ్రహం పొందండి" అంటూ సాదరంగా ఎంతో వినయంగా ఆహ్వానించేవారు శ్రీ కోటయ్య శాస్త్రిగారు. ఒక్కొక్కసారి సంతర్పణలో వంటకాల కోసం సేకరించిన దినుసులు తక్కువై వండిన వంటలు వచ్చిన వారందరికీ సరిపోవేమోనని

అనిపించేది. అయినప్పటికీ ఏ ఒక్కసారి కూడా వంటలు సరిపోకపోవడం జరిగేది కాదు. వచ్చిన వారంతా తృప్తిగా భుజించి వెళ్లిన తర్వాతకూడా వంటకాలు మిగిలిపోయేవి. అలా జరగడానికి కారణం కేవలం దేవి అనుగ్రహం అనేవారు శాస్త్రిగారు.

అతి నిరాడంబరంగా సాధారణ మానవుని వలె కనిపించే శాస్త్రిగారు గొప్ప యోగసిద్ధులు. అందుకు ఒక ఉదాహరణ.

మన్నవ గ్రామస్థులు కొందరు ఒకసారి కాశి వెళ్తూ శాస్త్రిగారిని కూడా తమ వెంట తీసుకునివెళ్లారు. అక్కడ వసతి గృహంలో దిగిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకొని, అందరూ గంగా స్నానానికి వెళ్లారు. అందరూ స్నానాలు ముగించి విశ్వేశ్వర దర్శనానికి ఆలయానికి బయలుదేరారు. శాస్త్రిగారు మాత్రం తాను గంగా తీరాన అనుష్ఠానం చేసుకొని కొంతసేపటి తర్వాత వస్తానని చెప్పటంతో వారంతా వెళ్లిపోయారు. విశ్వేశ్వర దర్శనానంతరం వసతిగృహానికి చేరుకున్న గ్రామస్థులు ఎంత సమయం గడిచినా శాస్త్రిగారు రాకపోయేసరికి ఆందోళన చెందారు. చాలాసేపు వేచిచూచి అప్పటికీ శాస్త్రిగారు రాకపోవడంతో అక్కడ తెలుగు మాట్లాడేవారితో గ్రామస్థులు, “అయ్యా, ఈ రోజే మేమంతా కాశీకి వచ్చాము. మాతోపాటు వచ్చిన ఒకాయన నల్లగా, లావుగా, ఎత్తుగా వుంటారు. తుండుగుడ్డ నడుముకు కట్టుకొని భుజాన ఒక పైగుడ్డ వేసుకొని వుంటారు. ఉదయం గంగాస్నానానికి మాతో కలిసి వెళ్లి స్నానానంతరం మేమంతా తిరిగి వస్తుంటే తను కాసేపు ఆగి వస్తానని మాతో చెప్పినవారు ఇప్పుడు మధ్యాహ్నామైంది ఇంతవరకు రానేలేదు. మీరేమైనా వారిని చూశారా?” అని అడిగారు. వారు అలా అడుగుతుండగానే శ్రీ కోటయ్య శాస్త్రిగారు అక్కడకు వచ్చారు. గ్రామస్థులు ఆయనను చూసి నవ్వుతూ “అరుగో వారే వచ్చేశారు!” అన్నారు. ఆయనను చూసిన అక్కడివారు, “వీరి గురించా మీరు అడుగుతున్నది? ఈయన ఈరోజు ఊరి నుండి రావటమేమిటి? ఈయన ఈ ఊరి వాడే కదా!” అన్నారు ఆశ్చర్యంగా.

“లేదండి మీరు ఎవరి గురించి అంటున్నారో గానీ, వీరు ఈరోజే మాతోపాటు కాశీ వచ్చారు. ఈ ఉదయమే కదా మేము కాశీ చేరాము. వీరు మా ఊరి వారేనండి” అన్నారు గ్రామస్థులు.

“మేము ఎవరి గురించో చెప్పటం లేదు, వీరి గురించే చెబుతున్నాము. వీరు మన్నవ గ్రామస్థులైన కోటయ్యశాస్త్రి గారే కదా! వీరు కాశీ పట్టణానికి వచ్చి చాలా కాలమైంది. ప్రతిరోజు ఉదయాన్నే గంగాస్నానం చేసి విశ్వేశ్వర దర్శనానికి వస్తారు. ప్రతిరోజు ఈయనను మేము చూస్తూనే వున్నాము కదా!” అని చెప్పిన అచ్చటి వారి మాటలు విని నిర్ఘాంతపోయారు మన్నవ గ్రామస్థులు. ఏమీ అర్థంకాక అయోమయంగా శాస్త్రిగారి వంక చూశారు. ఆయన ఏమీ మాట్లాడకుండా మందహాసం చేస్తూ వుండిపోయారు. ఈ సంఘటనతో మన్నవ గ్రామస్థులుతో పాటు కాశీవాసులు కూడా శ్రీ కోటయ్య శాస్త్రిగారు యోగ పరిపూర్ణులని గుర్తించారు. తమ గ్రామంలో భార్యాబిడ్డలతో నివసిస్తూ వుండి కూడా ప్రతినిత్యం కాశీలో సంచరిస్తున్న శ్రీ శాస్త్రిగారు యోగపరిపూర్ణుడని తెలుసుకున్నారు.

కాశీ పట్టణం శ్రీ శాస్త్రిగారి జీవితానికి ఆయువుపట్టు, కేంద్రం అని చెప్పవచ్చు. ఆయన ఆధ్యాత్మిక పరిపూర్ణత్వానికి ఆరంభగీతిక కూడా అక్కడినుండే ఆలపింపబడింది. అందుకే శ్రీ శాస్త్రిగారికి కాశీ పట్టణమంటే అంత అభిమానం. శ్రీ కోటయ్య శాస్త్రిగారు తమ ప్రాణప్రదమైన కాశీ పట్టణంలోని తమ తుది శ్వాస వదలాలని నిర్ణయించుకున్నారని సంకల్పించినట్లు తోస్తుంది. యోగసిద్ధుడు కనుక తమ అంతిమ సమయం తెలుసుకొని కాశీకి బయలుదేరారు తాను దేహ త్యాగం చేయబోతున్న విషయం ఆయన ఎవరికీ చెప్పలేదు ఒక్క కృష్ణయ్య గారికి తప్ప. వెళ్లే ముందు ఆ ఊరి వాస్తవ్యుడు మహాజ్ఞాని కృష్ణయ్యగారితో శ్రీ కోటయ్య శాస్త్రిగారు నవ్వుతూ, “అయ్యా కాశీకి వెళుతున్నానయ్యా” అన్నారు. కృష్ణయ్యగారు కూడా నవ్వుతూ “వెళ్ళవయ్యా, వెళ్ళు. తలకాయ రాలిపడేచోటికి కాళ్లు వాడంతటవే శరీరాన్ని లాక్కుపోతాయి మరి!” అని బదులిచ్చారు. ఇద్దరు పక పకా నవ్వుకున్నారు. కాశీలోనే ఆయన పరమపదించారు.

దైవ ప్రతినిధులైన ఇటువంటి యోగులు మాటలతో కాక మౌనంగానే మనోవాగతీతమైన దివ్యానంద స్థితి ఒకటి వున్నదని, ఆ స్థితినందుకొని బ్రహ్మానందాన్ని ఆస్వాదించి తమవలే తరించమని ప్రబోధిస్తూ తమ జీవితాలని ఉదాహరణలుగా మనకు అందిస్తారు. కానీ అందుకొనగల వారెందరు?

అయితే ఆ దివ్య జీవితాన్ని

*మిగతా 29వ పేజీలో*

# ద్వారకామాయి అనుభవమండపము

***శ్రీమతి కృష్ణకుమారి, హైదరాబాద్***

2008 సంవత్సరం వరకు నాకు బాబా గురించి తెలియదు. అప్పుడప్పుడు వారి మందిరానికి వెళ్లి నమస్కరించుకుంటూ ఉండేదాన్ని. అంతే.. అంతకుమించి ఏమీ తెలియదు. 2008 లో బాబా సచ్చరిత్ర పారాయణ చేసాను. అది చదివాక నాకు "భగవంతుడే ఆ రూపంలో వచ్చాడు" అన్న గాఢమైన నమ్మకం కలిగింది.

సచ్చరిత్ర పారాయణ పూర్తయిన సుమారు రెండు నెలల తర్వాత, జూన్ 7 వ తేదీన మేము శిరిడీ వెళ్ళాము. శిరిడి వెళ్ళాక 'ఆయన నడయాడిన ప్రదేశంలో నేనిప్పుడు వున్నాను' అనేటటువంటి భావనతో మనసులో విపరీతంగా ఆనందంగా వుండేది. ఎందుకో నాకు ఆయన తప్పకుండా దర్శనం యిస్తారు అన్న నమ్మకం కూడా వుండేది. జూన్ 9 వ తేదీ, నేనూ మా అక్క శిరిడీ లో ఒక షాప్ కి వెళ్ళాము. ఏదో కొనుక్కుంటుంటే అక్కడకి ఒకాయన వచ్చి మా అక్కని దక్షిణ అడిగారు. నేను వెనక్కి తిరిగి చూసాను. ఆయనకి తలపాగా వుంది, భుజానికి జోలె వుంది, కోరా గుడ్డలు ధరించి వున్నారు. నేనలాగే ఆయనని చూస్తూ వుండి పోయాను. మనసేమీ పనిచేయటం లేదు. మా అక్కచేతిలో వంద రూపాయల నోటు వుంది. ఆయనతో, "నా దగ్గర చిల్లరలేదు" అంది. నా దగ్గర చిల్లర వున్నా, యివ్వాలన్న స్పృహలో లేను. ఆయననే చూస్తూ వున్నాను. ఆయన సరేనని, వెళ్లిపోయారు. ఆయన వెళ్ళాక, షాప్ ఆయనకి డబ్బులిద్దామని చూస్తే, మా అక్క చేతిలో 100 రూపాయల నోటు లేదు. తను కంగారు పడుతూ, కింద ఎక్కడైనా పడిపోయిందేమోనని చూసింది, కానీ ఎక్కడా లేదు. ఈవిషయం ఆ షాపు ఆయనతో అంటే, "పెద్దాయన వచ్చి వుంటాడులేమ్మా. ఇంక అవి కనపడవులే" అన్నాడు. అప్పుడు నాకు, 'అక్కడకి బాబాయే వచ్చి వుంటారు' అనిపించి చాలా సంతోషమేసింది.

అక్కడనించి, నేనూ మా అక్క, బాబా ఫోటోలు అమ్మే గ్యాలరీకి వెళ్ళాము. నాకు అప్పటి వరకు, ద్వారకామాయి బాబా ఫోటో, సమాధిమందిరంలో బాబా ఫోటో తెలుసు. ఇంక వేరేవి తెలియదు. అయితే మేము ఆ షాప్ లోకి వెళ్లేసరికి, ఇందాకా వేరే షాపులో ఒకాయన వచ్చి దక్షిణ అడిగారుకదా, అచ్చంగా అలాంటి పోలికలున్న బాబా ఫోటో ఈ షాపులో వుంది. ఆ ఫొటో చూడగానే, ఇందాక వచ్చింది బాబానే అని నాకు రూఢి అయిపోయింది. నాకు బాబా దర్శనం ఇచ్చారు. సందేహమేలేదు, నేను ఇంటిదగ్గర బయలుదేరినప్పటినించి, బాబానాకు ఎలాగైనా దర్శనం ఇవ్వాలని ప్రార్థిస్తూనే వున్నాను. బాబా నా కోరిక తీర్చారని చాలా ఆనందం కలిగింది.

నేను శిరిడీ నించి వచ్చాక ఒక అనుభవం జరిగింది. నేనప్పుడు విజయవాడలో ఉండేదాన్ని. అక్కడకి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో మేము కొంత భూమి కొన్నాము. అది రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రెండు నెలలు గడువు పెట్టుకున్నాము. అయితే అవతలి వాళ్ళు మేము ఎప్పుడు అగ్రిమెంట్ చేయించుకున్నామో

అప్పటినించి, వడ్డీ కట్టమంటున్నారు. మీరిచ్చిన గడువు దాటిపోతే వడ్డీ కడతాముగాని, యిప్పటినించి ఎందుకు కడతామని మేమన్నాము. ఇక రిజిస్ట్రేషన్ కి వెళ్లేరోజు, అనుకున్న డబ్బు కంటే ఎక్కువ కట్టవలసి వస్తుందేమోనని భయంగానే వుంది. నేను ప్రతి క్షణం బాబాని తలచుకుంటూ వున్నాను. అక్కడకి వెళ్ళాక, వాళ్ళ తరఫున వచ్చిన వ్యక్తి, ఒక లిస్ట్ తయారుచేసి దీనికింత, దానికంత అని లెక్కలు వేసారు. చివరకి అవన్నీ కలిపితే మేమెంత యివ్వాలనుకున్నామో అంత మొత్తమే వచ్చింది!! మేము ఆ డబ్బు కట్టేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాము. మొదట వాళ్ళు చెప్పినట్లే ఎక్కువ మొత్తమే కట్టాలంటూ చెప్పిన ఆ వ్యక్తి, చివరికి లెక్క ఎలా సవరించాడో, అదంతా బాబాకే ఎరుక. అది బాబా మాకు చేసిన గొప్ప లీల!!

విజయవాడ లో రామలింగేశ్వరనగర్ లో బాబా మందిరం వుంది. మొదటిసారి మా అమ్మాయి వాళ్ళతో కలిసి ఆ మందిరానికి వెళ్లాను. లేత తులసి చిగుళ్ళు, మల్లెపువ్వులు కలిపి బాబాకి మాల కట్టి తీసుకెళ్ళాను. అక్కడి పూజారి ఆ మాలని నన్నే బాబాకి వెయ్యమన్నారు. అలానే చేశాను. చాలా అందంగా అనిపించి అక్కడే నిల్చుని బాబాని చూస్తున్నాను, బాబా పాదాల దగ్గర ఎవరో నైవేద్యంగా రెండు చపాతీలు పెట్టారు. నాకు అవి కొంచం ప్రసాదంగా ఇస్తే బాగుండును అనిపించింది. పూజారిగారు. ఒక చపాతి, మూడుముక్కలు చేసి, నాకు మా అమ్మాయికి మాతోపాటు వచ్చిన ఇంకొక అమ్మాయికి ఇచ్చారు. వాళ్లద్దరూ వెంటనే తినేశారు, నేను అలాగే చేతిలో పట్టుకుని, అక్కడి పూజారిగారితో మాట్లాడుతున్నాను. కొంతసేపటికి తిందామని చూసేసరికి, నాకిచ్చిన చపాతి నిండుగా పంచదార వుంది. వాళ్ళని అడిగితే ఉత్తి చపాతీనే ఇచ్చారని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యమేసింది ఈ చేతిలోకి పంచదార ఎలా వచ్చిందీ అని! నేను ఎంతో ఆనందంగా ఒక్క పంచదార పలుకుకూడా పోకుండా జాగ్రత్తగా తినేసాను.

ఆ తరువాత శ్రీ సాయి లీలామృతము పారాయణ గ్రంథం నా దగ్గరకి రావడం, భరద్వాజ మాస్టరుగారి గురించి తెలియడం, నేను ఈమార్గంలోకి రావడం జరిగింది. తరవాత ఆలోచిస్తే ఇంత మంచిమార్గాన్ని నాకు ప్రసాదిస్తున్నాను అన్న గుర్తుకే బాబా ఆరోజు చపాతీలో పంచదార వేసివుంటారు అనిపించింది.

2011లో మొదటిసారి సాయి లీలామృతము పారాయణ చేసాక నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నదర్శనం ఇచ్చారు. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు నిల్చుని ఉంటే, పూజ్యశ్రీ అమ్మగారు కుర్చీలో కూర్చుని వున్నారు. ఇప్పుడు మనం చూసే ఫొటోలో లాగ ఇద్దరూ కూర్చుని లేరు. దానితో నాకు ఆవిడ ఎవరో తెలియలేదు. ఎందుకంటే నాకు పూజ్యశ్రీ మాస్టరు గ్రంథాలేవీ చదవలేదు వారి గురించి కూడా ఏమీ తెలియదు. సత్సంగ సభ్యులెవరితోటీ పరిచయంలేదు. మహాత్ములంటే అవగాహన లేదు.

చాలా రోజులకి, నేను మాకు తెలిసిన వాళ్ళింటికి వెడితే, అక్కడ అమ్మగారి ఫోటో వుంది, వాళ్ళని అడిగితే, పూజ్యశ్రీ మాస్టరుగారి ధర్మపత్ని అని చెప్పారు. హైదరాబాద్ లో ఉంటారని తెలిసింది. ఆ స్వప్నంలో పూజ్యశ్రీ అమ్మగారు నాతో, "ఇక్కడకి వచ్చి ఒక సంవత్సరం వుండు" అని చెప్పారు. ఇక్కడ అంటే అది ఏ ప్రాంతమో తెలియలేదు. తరవాత శ్రీ గురుచరిత్ర గ్రంథం వెనకాల పేజీలో హైదరాబాద్ లో పూజ్యశ్రీ అమ్మగారు వుండే చిరునామా దొరికింది. నేనప్పుడు విజయవాడలో వున్నాను. అక్కడకి రావాలంటే పరిస్థితులేవీ అనుకూలించలేదు. మా అబ్బాయికి పెళ్లి అయ్యాక వాడితో హైద్రాబాద్ వచ్చి వుంటున్నాను. చివరకి 2018 లో నాగోల్ కి వెళ్లాను. అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనాలు లేనందున, నా స్వప్నం సంగతి ఎవరికీ చెప్పకుండా వెనుతిరిగాను.

చివరికి గుమ్మళంపాడులో కొలువైవున్న పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో, 41 రోజులు వుండి సేవ చేసుకోవాలని సంకల్పించుకుని, ఆశ్వయుజ మాసంలో అక్కడికి చేరుకున్నాను. మండలం రోజులకంటే ఎక్కువ రోజులే, అమ్మ సన్నిధిలో వున్నాను..ఆవిధంగా పూజ్యశ్రీ అమ్మగారే నా పరిస్థితులన్నీ చక్కబరచి నాకు కొద్దిరోజులైనా సేవించుకునే భాగ్యాన్ని ప్రసాదించినందుకు, శత సహస్రకోటి కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి విజయలక్ష్మి

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని చిలువూరు వాస్తవ్యులు శ్రీమతి విజయలక్ష్మిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు --

మొట్టమొదటిసారి మా అక్క ఝాన్సీ ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారితో దత్తక్షేత్రాల యాత్రకి వెళ్లే మహాభాగ్యం కలిగింది. దారిలో బస్సుని కాఫీ, టీల కోసం ఒకచోట ఆపినప్పుడు అందరూ దిగారు. నేను మాత్రం బస్సు దిగలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారికి కాఫీ బస్సులోకే తెచ్చారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, నేను మాత్రమే బస్సులో వున్నాం. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి వెళ్లి నమస్కారం చేసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, “ఏమ్మా, ఏమైనా సమస్యలున్నాయా? ఏమన్నా చెప్పాలనుకుంటున్నావా?” అని అడిగారు. నిజానికి నాకు సమస్యలున్నాయి. కానీ చెప్పడం రాదు. ఎలా చెప్పాలో అర్థమయ్యేది కాదు. ఆ సంగతి పూజ్యశ్రీ మాస్టరుగారికి అర్థం అయ్యిందనుకుంటాను. “అమ్మా! నువ్వు శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతం పారాయణ చేసుకో!” అన్నారు.

నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో, “మా వూరిలో శివాలయం, రామాలయం వున్నాయి కానీ బాబా గుడి లేదండీ!” అన్నాను. “అమ్మా! మీ ఇంట్లో బాబా పటం పెట్టుకుని సత్సంగం చేసుకోండి. చుట్టుపక్కల అందరికీ బాబాను పరిచయం చెయ్యండి. మీకు ఇది బాబా యిచ్చిన మంచి అవకాశం” అని చెప్పారు. యాత్రనుంచి రాగానే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు సత్సంగం పెట్టుకున్నాము. చాలా మంది వచ్చేవారు. నాకు భజనంటే చాలా ఇష్టం. నేను గట్టిగా భజన చేస్తూవుంటే మావారు, “ఇది మన సొంత ఇల్లు కాదు, అంత గట్టిగా పాడావంటే ఇంటివాళ్ళు ఖాళీ చెయ్యమంటారు” అంటుండేవారు. కొన్ని రోజులలోనే పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల మేము ఇల్లు కొనుక్కున్నాము.

తిరిగి ఆరు నెలలకే పూజ్యశ్రీ మాస్టరుగారు మళ్ళీ దత్తక్షేత్రాలకి యాత్ర చేశారు. నేను కూడా ఆ యాత్రకు వెళ్లాను. మాణిక్యనగర్, గాణ్గాపూర్, అక్కల్కోట, పండరి, శిరిడి.... అన్నీ చూపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారితో వెళ్లడంవలన మాకు కూడా మర్యాదలు జరిగేవి. గాణ్గాపూర్లో పూజ్యశ్రీ మాస్టరుగారితో పాటు మాకు కూడా ప్రత్యేక పాదుకాదర్శనం లభించింది. అలాగే శిరిడీలో రాత్రి ఆరతి ముందర ఒక గంట భజన చేసే సేవ లభించింది. అందరం తలా ఒక భజన చేశాం. పూజ్యశ్రీ మాస్టరుగారు ‘మానస భజరే గురుచరణం’ భజన చెప్పారు. అంతా అయ్యాక శిరిడి సంస్థానం వాళ్ళు మా అందరికీ ఒక కొబ్బరికాయ, దక్షిణ ఇచ్చారు. ఆ దక్షిణ ఇప్పటికీ మా పూజాపీఠంలో వుంది.

ఇంకొకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు లెండిబాగ్ లో సత్సంగం చేస్తున్నారు. మేమందరం చుట్టూ కూర్చుని వింటున్నాము. ఇంతలో ఒక పెద్దగుంపు వచ్చి వరసగా ఒక్కొక్కరూ పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుంటున్నారు. మేము ఆశ్చర్యంగా చూస్తున్నాము. వాళ్ళు మైసూరునుంచి యాత్రాబస్సులో శిరిడీకి వచ్చారట. వాళ్ళందరూ పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన గ్రంథాలు చదివారట. ఎవరో వాళ్లకి పూజ్యశ్రీ మాస్టరుగారు ఇక్కడ

వున్నారని చెప్పారట. విపరీతమైన ఆనందంతో దర్శనం చేసుకున్నారు. ఇలా ఎన్నో సంఘటనలు జరిగేవి.

ఆ యాత్రలోనే పూజ్యశ్రీ మాస్టరుగారితో నేను, "మీ దయవల్ల ఇల్లు కొనుక్కున్నాము కానీ రిజిస్ట్రేషన్ అవ్వటం లేదు. ఏదో ఒక ఆటంకం వస్తోంది మాస్టరుగారు" అని చెప్పాను. దానికి పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఇక్కడకి వచ్చావు కదా, ఆటంకమేమీ రాదమ్మా!" అంటూ "నీకు ఇష్టమైన పదార్థం ఏది?" అనడిగారు. 'స్వీట్ అండీ!' అన్నాను. "స్వీట్స్ లో ఇష్టమైనదేది?" అనడిగారు. "పాలకోవా!" అని చెప్పాను. "అయితే నీ సమస్య బాబాకి చెప్పుకుని, ఆ పదార్థం వదిలేసి ధునిలో కొబ్బరికాయ వేసుకో. ఇంటికెళ్ళాక పారాయణ చేసుకో. ఇంక బాబా చూసుకుంటారు!" అని చెప్పారు. నేను అలాగే చేశాను. ఇంటికి వచ్చాక ఒక వారం పారాయణ పూర్తయ్యేసరికి మావూరి కరణంగారు మా ఇంటికి వచ్చి, 'ఇంటికి సంబంధించిన కాగితాలు తీసుకురండి. రిజిస్ట్రేషన్ చేసేద్దామ'ని చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో నాకు ఇచ్చిన హామీ పొల్లుపోకుండా జరిగినందుకు చాలా ఆనందించాము.

ఒకసారి మేము కొంతమందిమి కలిసి ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్ళాము. అప్పుడు కూడా అందరూ వారి వారి వ్యక్తిగత విషయాలు మాట్లాడారు. నేను మాత్రం చెప్పలేకపోయాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ఉద్దేశించి, "అమ్మా! సత్సంగాలు జరుగుతున్నాయా?" అడిగారు. "జరుగుతున్నాయి మాస్టరుగారు!" అంటే, "ఈసారినుంచి మీ ఇంట్లోనే కాకుండా సత్సంగానికి వచ్చిన వాళ్ళందరి ఇళ్లల్లో కూడా సత్సంగం చేసుకోండి. తొందరలోనే మీ ఊరికి బాబా గుడి కూడా వస్తుంది" అన్నారు. వారు చెప్పినట్లే మేమందరం అందరి ఇళ్లల్లో సత్సంగాలు చేసుకుంటున్నాము. బాబా గుడి కూడా వచ్చింది. ఆయన ఒకమాట చెప్పారంటే అది జరిగి తీరుతుంది!!

వారికి ఎదుటివాళ్ళ మనసులో ఏముందో తెలిసిపోయేది. మా చిన్నబ్బాయి బాగా అల్లరి చేసేవాడు. బాగా విసిగించేవాడు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు గుంటూరు అరండల్ పేట బాబా గుడికి వచ్చారు. నేను మా చిన్న అబ్బాయిని తీసుకుని వారి దర్శనానికి వెళ్లాను. అప్పుడు వాడు 6వ తరగతి చదువుతున్నాడు. పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకొమ్మని చెప్పాను. వాడు నమస్కారం చేసుకోగానే, "ఏరా, బాగున్నావా? క్రికెట్ బాగా ఆడుతున్నావా? వీడిని నా దగ్గరికి పంపించమ్మా. ఇద్దరం క్రికెట్ ఆడుకుంటాం. వీడికి నేను మంచి మంచి బాబా కథలు చెప్తాను" అన్నారు. నేను మా అబ్బాయికి దక్షిణ ఇచ్చి సమర్పించమన్నాను. వాడు పూజ్యశ్రీ మాస్టరుగారికి యివ్వగానే ఆయన అది తీసుకుని జేబులో పెట్టుకున్నారు. మామూలుగా ఎవరు దక్షిణ యిచ్చినా పక్కన పెట్టేసేవారు. నాకు వారు చూపించే ప్రేమకి ఆనందభాష్పాలు వస్తున్నాయి. మా అబ్బాయి మాత్రం భయంతో వణికిపోతున్నాడు. ఎందుకంటే వాడు స్కూలుకి వెళుతున్నానని చెప్పి క్రికెట్ కి వెళ్ళేవాడు. అవన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేసరికి వాడికి భయం వేసింది.

ఇంకొకసారి నల్లపాడు బాబా గుడికి రామిరెడ్డి తాత, మాయి అమ్మ వచ్చారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా వచ్చారు. మేము కూడా దర్శనం చేసుకోవడానికి వెళ్ళాము. అందరూ వెళ్ళిపోయాక మా చెల్లెలు రామిరెడ్డి తాతగారిని మా చిన్నబ్బాయి గురించి అడిగింది. దానికి తాతగారు తలగోక్కుంటూ, "కష్టపడాలి, నువ్వే సర్దుకోవాలి!" అన్నారు. కొంతసేపయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక్కరే వున్నప్పుడు నేను వారితో, "తాతగారేమన్నారో అర్థం కాలేదు" అన్నాను. "ఏముందమ్మా, సమయం పడుతుందని చెప్తున్నారు. పారాయణ చేసుకో, అన్నీ సర్దుకుంటాయి" అన్నారు. ఇంట్లో ఆర్థిక సమస్యలు, మావారికి ఆరోగ్య, ఉద్యోగ సమస్యలు, పిల్లలతో సమస్యలు.. ఇన్ని వున్నా ఏనాడూ పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పేదాన్ని కాదు. ఎలా చెప్పాలో తెలియక మౌనంగా వుండిపోయేదానిని.

1989లో మాస్టరుగారు సమాధి చెందారు. అప్పటినుంచి నాకు చాలా దిగులుగా వుండేది. 'అయ్యో! మహారాజంతటివారు అడిగినప్పుడు కూడా ఏమీ చెప్పుకోలేకపోయాను. ఇప్పుడు నా కష్టాలెవరు తీరుస్తారు?' అని బాధపడుతుంటే ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్న దర్శనమిచ్చి,

నా ఎదురుకుండా కూర్చుని, "ఎందుకమ్మా బాధపడతావ్? నేనిక్కడే వున్నాను, ఎక్కడికీ పోలేదు. అంతా బాగానే జరుగుతుంది. బాధపడకు!" అని చెప్పారు.

నేను సమస్యలతో బాధపడుతున్న ప్రతిసారీ నాకు స్వప్న దర్శనమిచ్చి ఓదార్చేవారు. ఒకసారి ఒకరు మాదగ్గర డబ్బులు తీసుకుని ఎంతకాలమైనా ఇవ్వడం లేదని నేను బాధ పడుతుంటే స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఎందుకమ్మా బాధపడతావ్? అవే వస్తాయి!" అన్నారు. వారు అన్నట్లు గానే రెండు మూడు రోజుల్లో మావద్ద అప్పు తీసుకున్న అతను తనంతట తానే ఆ డబ్బును తెచ్చి యిచ్చేసాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు సర్వాంతర్యామి కనుక నేనంటూ ఏమీ చెప్పకపోయినా నా వెన్నంటే వుండి నా సమస్యలన్నీ పరిష్కరిస్తూ, నాకు ధైర్యాన్ని ప్రసాదిస్తూ నన్ను అనుగ్రహిస్తున్నారు.

నేను ఎవరేమి చెప్పినా నమ్మేస్తాను. ముందూవెనుక ఆలోచించను. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో, "పారాయణ వదలకుండా చేసుకో, ఎవ్వరేం చెప్పినా నమ్మేయకు!" అని చెప్పారు. అప్పటినుంచి జాగ్రత్తపడడానికి ప్రయత్నిస్తున్నాను.

ప్రతి జన్మలోనూ పూజ్యశ్రీ మాస్టరుగారే నా జీవితాన్ని నడిపించాలని అర్థిస్తూ వందనాలర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

## మహాయోగి శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రి గారు

24వ పేజీ తరువాయి

అందుకోనాలంటే మరొక అత్యంత ముఖ్యమైన విషయాన్ని కూడా శ్రీ వెంకటేశ్వర భక్తుడు పరమ భాగవతోత్తముడు అయిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారు ప్రజలకు ఇలా సూచించారు. భగవంతుడిది మాత్రమే కాక, ఆయన భక్తుల యొక్క ప్రాధాన్యత ఎంతగొప్పదో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారు తన కీర్తనల ద్వారా ఎంత బాగా చెప్పారో చూడండి:

***నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు***  
***నిగమాంత విధులు వైష్ణవులు***  
***సత్యము వీరల శరణని బ్రతుకరో***  
***సాటికి బెనగక జడులాల***


***తప్పరు తను పట్టిన వ్రతమెప్పుడు***  
***దైవమొక్కటే గతి అనుచు***  
***కప్పిన శ్రీ వేంకటపతి దాసులు***  
***కర్మ విదూరులు సాత్వికులు***  
***చెప్పకు డితరుల సరిగా వీరిని***  
***సేవించగ నే ధన్యుడ నైతి***

ఇలా స్వయంగా తానే ఒక మహాభక్తుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారు తాను దైవభక్తవరేణ్యులను సేవించటం వలన ధన్యుడ నైనాననీ, నిర్మలచిత్తులైన అటువంటి వారికి శరణాగతులై జీవించటం అవసరమని బోధించారు. కనుక మనమందరము శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారి వంటి మహాత్ములను స్మరిస్తూ, నమస్కరిస్తూ, సేవిస్తూ ధన్యుల మవుదాం!!

## ధర్మ భ్రష్టత ఎలా ఆరంభమౌతుంది?

03వ పేజీ తరువాయి

అనివార్యంగా ఎలా నేల పాలవుతుందో, అలానే ఈ పతనం ఒకసారి ఆరంభమయ్యాక నివారించడం చాలా కష్టం. కారణం ధర్మాధర్మ విచక్షణకు బదులు ప్రియము-అప్రియము, రాగద్వేషాలు, వీటికి మూలమయిన అహంకార మమకారాలు పనిచేయడం ప్రారంభిస్తాయి. అక్కడ నుంచి అటువంటి వ్యకులు చేసే ప్రతిపనీ హింసాత్మకం అవుతూ వుంటుంది. ధృతరాష్ట్రుడు తన కొడుకులపైన మమకారంతో వారిని నిగ్రహించనందువల్లనే ఎంత హింసకు కారకుడయ్యాడో-- ప్రత్యక్షంగా ఎట్టి హింసా చేయనట్లు కనబడినప్పటికీ! కాని అధర్మాన్ని నిగ్రహించడాని కోసం మాత్రమే, దానినుండి ధార్మికులైన పాండవులను రక్షించడం కోసం మాత్రమే ప్రతిచర్య తీసుకున్నప్పటికీ పాండవులు, శ్రీకృష్ణుడు ఎంత హింసాత్మకులుగా పనిచేయవలసివచ్చిందో! కైక మీద దశరథుడికున్న వ్యామోహమే, సీతారాముల కష్టగాథలన్నింటికి మూలం.



పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST**

**Regd.Office:** Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

**Branch Office** : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound) | 450-00 |
| శ్రీ సాయి లీలామృతం | 150-00 |
| శ్రీ గురు చరిత్ర | 150-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రభోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము - భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 125-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి - ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాలస్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము - మన సంస్కృతి | 70-00 |

ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1 | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2 | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |
| బాలల శ్రీ గురు చరిత్ర | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము | 15-00 |
| మాష్టారు అమృత వాక్కులు | 100-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master (Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's Sai Baba the Master | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 150-00 |
| Sai Leelamrutham (Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shiridi Aarathi (Tamil) | 15-00 |
| Stavana Manjari (Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |
| Sai Sannidhi (Kannada) | 120-00 |
| Sri Guru Charitra (Malayalam) | 150-00 |
| Sri Guru Charitra (Oriya) | 150-00 |





Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



శ్రీ అలివేలు మంగమ్మ, దివ్యసన్నిధానములో దత్త జయంతి వేడుకలు (7-12-22)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.